




https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 10 | సంచిక 152 | కర్నూలు | శనివారం జూన్ 28 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi








# ఆరోగ్యాంధ్రప్రదేశ్ నా లక్ష్యం



## టూరిజానికే అతిపెద్ద భవిష్యత్ పర్యాటకంగా ఏపిని అభివృద్ధి చేస్తా సిఎం చంద్రబాబు నాయుడు

విజయవాడ,జూన్27((శ్రీచక్ర) ప్రజలందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలన్నదే తన లక్ష్యమని ఏపీ సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. విజయవాడలో నిర్వహించిన టూరిజం కాన్‌క్లేవ్ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో పర్యాటకం అభివృద్ధి చెందేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఆగస్టు 15లోగా అన్ని సేవలను ఆన్‌లైన్‌లో అందిస్తామని తెలిపారు. ఆధ్యాత్మికవేత్తగా ఉన్న బాబా రామ్‌దేవ్ సమాజానికి సేవ చేస్తున్నారని కొనియాడారు. పర్యాటక శాఖకు సలహాదారుగా ఉండాలని బాబా రామ్‌దేవ్‌ను కోరారువిజయవాడలో గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ టూరిజం ఆధ్వర్యంలో జరుగుతున్న టూరిజం కాంక్లేవ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో అనారోగ్య సమస్యలకు యోగా పరిష్కారమని, యోగా నిత్య జీవితంలో భాగం కావాలన్నారు. ప్రధాని మోడీ యోగాను దేశంలో ప్రమోట్ చేస్తున్నారు. అంతర్జాతీయ యోగా డే ఇంత గ్రాండ్ గా జరుగుతుందని ఎవరూ ఊహించలేదని.. కానీ 3 లక్షలకు పైగా విశాఖపట్నంలో పాల్గొని గిన్నిస్ రికార్డ్ సృష్టించారన్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ లో వెల్నెస్ కి చిరునామా అవుతుంది. అందరికి యోగ అందించాలనే లక్ష్యంగా పని చేస్తున్నాం. రామ్ దేవ్ బాబాను ఏపీకి టూరిజం సలహాదారుగా ఉండాలని కోరుతున్నానని అన్నారు. కమ్యూనిజం.. సోషలిజం.. క్యాప్టిలిజం.. అన్ని ఇజాలు పోయాయని.. టూరిజం ఒక్కటే మిగిలిందని నేను ఎప్పుడో చెప్పాను. నేను గతంలో టెక్నలాజిని ప్రమోట్ చేశాను. గతంలో బిల్ గేట్స్ తో సమావేశం తర్వాత హైదరాబాద్ లో సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాట్సాప్ లో 700 కు పైగా సేవలు అందుబాటులో ఉన్నాయి. టూరిజం ఒక్కటే ఉద్యోగాలు ఇవ్వగలదు. ప్రకృతి



# మొహర్రం.. త్యాగానికి ప్రతీక

అమరావతి, జూన్ 27:(శ్రీచక్ర) మొహర్రం సందర్భంగా ముస్లిం సోదరులను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సందేశం ఇచ్చారు. చారిత్రాత్మక పోరాటానికి గుర్తు మొహర్రం అని.. మహమ్మద్ ప్రవక్త మనుమడు బలైన రోజు అని అన్నారు. ఈరోజుతో ఇస్లామ్ సంవత్సరం ప్రారంభమవుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అలాగే మొహర్రంను పురస్కరించుకుని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కూడా ట్విట్టర్‌లో స్పందించారు.‘మానవ హక్కుల కోసం జరిగిన చారిత్రాత్మక పోరాటానికి గుర్తు మొహర్రం. మహమ్మద్ ప్రవక్త మనుమడైన ఇమామ్ హుస్సేన్‌ను శత్రువులు బలిగొన్న రోజు ఇదే. మొహర్రం మాసం ఆరంభం రోజున ఇస్లామ్ నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు సాంప్రదాయాలకు అనుగుణంగా మొహర్రం జరుపుకోవాలని కోరుకుంటున్నాను’ అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.


# వ్యక్తిగతంగా జూలై11న హాజరు కండి

## విద్యాశాఖ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం




అమరావతి,జూన్27 ):హైకోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.. ఎయిడెడ్ విద్యాసంస్థలలో నియామకాలపై విద్యాశాఖ కమిషనర్‌ను వ్యక్తిగత హాజరుకు ఆదేశించింది. అయితే, ఎయిడెడ్ విద్యా సంస్థలలో ఏళ్ల తరబడి నిలిచి పోయిన నియమకాల విషయంలో విద్యాసంస్థలు దాఖలు చేసిన పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరిగింది.. పాఠశాలలలో నియామకాలు చేపట్టాల్సిందిగా మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను గతంలోనే జారీ చేసింది న్యాయస్థానం.. అయితే, ఈ ఉత్తర్వులను విద్యాశాఖ అమలు చేయని కారణంగా పాఠశాల యాజమాన్యాలు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.. విచారణ జరిపిన హైకోర్టు విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదేశాలు జారీ చేసింది.. జులై 11వ తేదీన హైకోర్టు ముందు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలు ఇచ్చింది..

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు



హైదరాబాద్, జూన్ 27: ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజు రోజుకు కొత్త విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ ట్యాపింగ్ వ్యవహారంలో బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ కేసులో విచారణను సిట్ అధికారులు వేగవంతం చేశారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు మాజీ డీఎస్పీ ప్రణీత్ రావుల విచారణలో ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలను సేకరించారు సిట్ అధికారులు. ఇప్పటికే వేల సంఖ్యలో ఫోన్లు ట్యాపింగ్ చేసినట్టు సిట్ బృందం గుర్తించింది. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్ బాధితుల స్టేట్‌మెంట్‌లను సిట్ బృందం రికార్డ్ చేస్తోంది. ఇప్పటి వరకు 257 మంది ఫోన్ ట్యాపింగ్ బాధితుల స్టేట్‌మెంట్‌లను రికార్డ్ చేసింది సిట్. కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 200 మంది నాయకుల ఫోన్ నెంబర్లను ప్రభాకర్ రావు టీం ట్యాప్ చేసింది. ఈరోజు మరి కొంతమంది సాక్షుల వాంగ్మూలాలను రికార్డు చేయనున్నారు. 4200లకు పైగా ఫోన్లు ట్యాప్ అయినట్లు గుర్తించారు. రాజకీయనాయకులు, గవర్నర్లు, హైకోర్టు జడ్జిలు, మీడియా, సినీ, ఫార్మా, ఐటీ ప్రముఖుల ఫోన్లు ట్యాప్ అయినట్లు సిట్ తేల్చింది. ఇప్పటికే చేవెళ్ల ఎంపీ, బీజేపీ సీనియర్ నేత కొండా విశ్వేశ్వర్ రెడ్డిని వాంగ్మూలం ఇచ్చేందుకు రావాలని సమాచారం ఇచ్చింది సిట్ బృందం. ఈ క్రమంలో సిట్ ముందుకు కొండా విశ్వేశ్వర్ రెడ్డి రానున్నట్లు తెలుస్తోంది.కాగా.. గత ఏడాది మార్చిలో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు అయ్యింది. దాదాపు ఏడాదిగా ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కొనసాగుతోంది. ప్రభాకర్ రావు అమెరికాలో ఉండటంతో ఈ కేసు విచారణ ఆలస్యమైంది. ఇక ఎట్టకేలకు ప్రభాకర్ రావు అమెరికా నుంచి రావడంతో ఈ కేసులో విచారణను వేగవంతం చేసి సిట్. దాదాపు నెల రోజులుగా ప్రభాకర్ రావును విచారిస్తున్న సిట్ బృందానికి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దాదాపు 4200లకు పైగా ఫోన్లు ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు అనేక మంది సాక్షుల నుంచి వాంగ్మూలం తీసుకున్న సిట్ అధికారులు.. మరికొంత మంది నుంచి కూడా స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నారు.

# కోర్టుకు కొడాలి..



కృష్ణాజిల్లా (గుడివాడ):(శ్రీచక్ర) గుడివాడలో మాజీమంత్రి, వైసీపీ కీలక నేత కొడాలి నాని సుదీర్ఘ విరామం తర్వాత కనిపించాడు. ఓ కేసులో ముందస్తు బెయిల్ కోసం గుడివాడ కోర్టుకు ఆయన హాజరయ్యారు. అయితే.. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు వస్త్ర దుకాణంపై దాడి కేసులో ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు కొడాలి నాని దరఖాస్తు చేసుకున్నారు.కింద కోర్టులో బెయిల్ తీసుకోవాలన్నహైకోర్టు ఆదేశాలతో ష్యూరిటీ పత్రాలు సమర్పించేందుకు గుడివాడ కోర్టుకు కొడాలి నాని హాజరయ్యారు. ఆ కేసులో బెయిల్‌పై 16 మంది అనుచరులు విడుదలయ్యారు. పోలీస్ కస్టడీలో కొడాలి నాని చెబితేనే దాడి చేసినట్లు పలువురు అనుచరులు అంగీకరించారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఏడాది తర్వాత గుడివా డలో కొడాలి నాని కనిపించారు. ఆయన రాకతో కోర్టు వద్దకు వైసీపీ శ్రేణులు చేరుకుంటున్నారు.

**రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్..**

కాగా.. కొడాలి నాని గుడివాడ రాక రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయంతో గుడివాడకు దూరంగా కొడాలి నాని ఉంటున్నారు. నాని వచ్చిన విషయం తెలుసుకొని ఇంటి వద్దకు వైసీపీ శ్రేణులు భారీగా చేరుకుంటున్నారు. ఈరోజు (శుక్రవారం) సాయంత్రం ఆయన ఇంటి నుంచి నేరుగా హైదరాబాద్‌కి వెళ్లనున్నారు. ఒక్కసారిగా కోర్టు వద్ద కొడాలి నాని ప్రత్యక్షం కావడంతో పోలీసులు ఖంగుతిన్నారు. కొడాలి నానిని ఎవరెవరు కలుస్తున్నారు, వారి కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇప్పటికే కొడాలి నాని, ఆయన అనుచరులు చేసిన అరాచకాలపై ఏపీ పోలీసుల విచారణలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

# మాజీ సీఎం వైఎస్ జగన్ కు ఊరట

## జగన్ క్వాష్ పిటిషన్‌పై విచారణ తొందపాటు చర్యలు వద్దని హైకోర్టు ఆదేశం

అమరావతి,జూన్27(శ్రీచక్ర) ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కు ఊరట లభించింది. గుంటూరు జిల్లా జగన్ పర్యటనలో సింగయ్య అనే వ్యక్తి మృతి చెందటంతో నమోదైన కేసులో జగన్ క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా.. విచారణ జరిపిన న్యాయస్థానం ఎటువంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఇక, తదుపరి విచారణ వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. సింగయ్య మృతి కేసులో వైఎస్ జగన్ సహా వైసీపీ నేతలు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ లు మీద ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. జగన్ ఈ కేసులో ఏ2గా ఉన్నారు. జగన్ తో పాటు కారులో ప్రయాణించిన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి జగన్ పీఏ, మాజీ మంత్రి పేర్ని నాని, విడదల రజినిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఐదుగురు కూడా క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం పిటిషనర్లపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని వచ్చే మంగళవారానికి తదుపరి విచారణ వాయిదా వేసింది. ఇక, పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కారు ప్రమాదం జరిగితే కారు డ్రైవర్ కాకుండా ప్రయాణికులకు ఏం సంబంధం అని హైకోర్టు ప్రశ్నించింది. కండిషన్స్ పాటించాలని చెప్పినా.. జగన్ పాటించలేదని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. చాలా జాగ్రత్తలు తీసుకున్నా కుంభ మేళాలో ప్రమాదం జరిగింది కదా? అని న్యాయస్థానం పేర్కొంది. ప్రమాదానికి ప్రయాణికులు హిస్తారనీ న్యాయస్థానం వ్యాఖ్యానించింది. సింగయ్య మృతి కేసులో జగన్ పర్యటనకు ఇచ్చిన పర్మిషన్ నిబంధనలకు ఉల్లంఘించినట్టు కోర్టుకు ప్రభుత్వం తెలిపింది.

# భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేసిన పంజాబ్ పోలీసులు



చండీగఢ్:(శ్రీచక్ర) పాకిస్థాన్ ఐఎస్ఐ సహకారంతో భారీ ఉగ్రకుట్రను జరిగిన ప్లాన్‌ను పంజాబ్ పోలీసులు శుక్రవారంనాడు భగ్నం చేశారు. టెర్రర్ మాడ్యూల్ ఆటకట్టించారు. ఉగ్ర కుట్రకు పన్నాగం పన్నిన ఒక మైనర్‌తో సహా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిని బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (ఃఐఎ)కు చెందిన వారిగా గుర్తించారు. భారీ ఉగ్రకుట్రను భగ్నం చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడగలిగామని డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. అమృత్‌సర్‌లో లక్షిత హత్యలు, పోలీసు స్టేషన్లపై దాడులకు ఈ టెర్రర్ మాడ్యూల్ ప్లాన్ చేసినట్టు చెప్పారు.’ఇంటెలిజెన్స్ సమాచారంతో రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్ సెల్ ఈ ఆపరేషన్ నిర్వహించింది. పాక్ ఐఎస్ఐ సహకారం కలిగిన బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ టెర్రర్ మాడ్యూల్‌ను విజయవంతంగా పట్టుకున్నాం. యూకేకు చెందిన నిషాన్ సింగ్, పాకిస్థాన్‌కు చెందిన టెర్రరిస్ట్ హర్విందర్ రిండాలు దీనిని ఆపరేట్ చేస్తున్నారు. బీకేఐతో అసోసియేషన్ కలిగిన ఒక జువనైల్, మరో ఇద్దరిని అరెస్టు చేశాం’ అని డీజీపీ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో రెండు హ్యాండ్ గ్రెనేడ్‌లు, ఒక పిస్తోలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని డీజీపీ చెప్పారు. పట్టుబడిన ఇద్దరిని అమృత్‌సర్ రూరల్‌కు చెందిన సెహజ్‌పాల్ సింగ్, విక్రమ్‌జిత్ సింగ్‌గా గుర్తించామని, భారతీయ న్యాయ సంహిత, పేలుడు పదార్థాల చట్టంలోని వివిధ సెక్షన్ల కింద మొహాలి పోలిస్ స్టేషన్‌ను ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. రాష్ట్రంలో టెర్రర్ నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేసి, సంస్థాగత నేరాలను నిర్మూలించడం ద్వారా శాంతి, సామరస్య స్థాపనకు పంజాబ్ పోలీసులు కృతనిశ్చయంతో ఉన్నారని వివరించారు పంజాబ్ పోలీసులు ఐఎస్ఐ సహకారం ఉన్న ఖలిస్థాన్ టెర్రర్ మాడ్యూల్‌కు చెందిన 13 మందిని అరెస్టు చేశారు.

# దీపావళి నాటికి టిడ్కో ఇళ్ల అప్పగింత

## మంత్రి నారాయణ వెల్లడి

ఒంగోలు,జూన్27( ): టిడ్కో ఇళ్లపై లబ్దిదారులకు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణశుభవార్త చెప్పారు.. ప్రకాశం జిల్లా పర్యటనలో ఉన్న ఆయన.. మాట్లాడుతూ.. లబ్దిదారులకు దీపావళి నాటికి టిడ్కో ఇళ్లు అందజేస్తామని వెల్లడించారు.. గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక కష్టాలు వచ్చినా.. ఉన్నా.. ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్నాం అని తెలిపారు.. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తాం. మున్సిపాలిటీలు, పట్టణ అభివృద్ధి సంస్థల పరిధిలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే టిడ్కో ద్వారా నిర్మించిన ఇళ్లను అప్పగించే పనులు వేగవంతం చేసేందుకు సహకరించాలని ఇప్పటికే బ్యాంకర్లను మంత్రి నారాయణ కోరిన విషయం విదితమే.. బుధవారం ఏడీసీఎల్ భవనంలో బ్యాంక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన.. పీఎంఏవై పథకం విజయవంతానికి బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఇక, దీపావళి నాటికి ఇళ్లను పూర్తి చేయడానికి పెండింగ్ నిధులను విడుదల చేయాలని, కొత్త రుణాలను అందించడంలోనూ ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి నారాయణ విజ్ఞప్తి చేసిన విషయం విదితమే..



శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY

శనివారం జూన్ 28 2025

# సంపాదకీయం

## ప్రజల ఎజెండాను విస్మరిస్తున్న పాలకులు !

ప్రజల ఆకాంక్షలకోసం పోరాడుతాం...ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తామని ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు లక్ష్యాలను విస్మరించాయి. అధికారం రాకముందు ఒకలా, వచ్చిన తరవాత మరోలా వ్యవహరించి ప్రజలకు గుదిబండగా మారాయి. అధికారాన్ని కుటుంబ వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం అయ్యేలా చూశాయి. అరాచక పాలనతో పాటు, విపరీతంగా అవినీతికి పాల్పడ్డాయి. ఇవాళ ప్రజలు కాంగ్రెస్ వైపో, బీజేపీ వైపో మళుతున్నారంటే అందుకు ప్రధాన కారణం ప్రాంతీయ పార్టీల నేతల అవినీతి వ్యవహారాలే అని చెప్పు కోవాల్సిందే. ఈ క్రమంలో బిజెపి తన విధానాలు మార్చుకుంటే తప్ప మరింతగా నిలబడలేదు. ప్రజల్లో ఆందరణ పొందలేదు. ఉమ్మడి ఎపిలో బిఆర్ఎస్, వైకాపాలు ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపాయి. కానీ అప్పులు చేసి రాష్ట్రాలను కుప్ప చేసి వెళ్లాయి. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ కూడా అప్పులపైనే కాలం వెళ్లదీస్తోంది. అప్పులు చేయకుండా ముందుకు అడుగు వేయలేని దుస్థితిలో రాష్ట్రాలు ఉన్నాయి. ఉచిత పథకాలు, పందేరాలతో రోజురోజుకు ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇదే పాలనగా, ఇదే అభివృద్ధిగా చూపుతున్నారు. మోడీ అవినీతి పాలన అంటూ బిజెపి ప్రచారం చేసుకుంటున్నా...ప్రజలకు ఒనగూరుతున్న ప్రయోజనాలు కానరావడం లేదు. నిత్యావసర ధరలు, నిరుద్యోగంపై చర్చించే దమ్ము లేదు. ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలు ఇప్పుడు బలపడ్డా వారు కూడా మోడీ భజనలో తరించిపోతున్నారు. చంద్రబాబు, నితీశ్ కుమార్ ఈ కోవలోకి చెందినవారుగా చూడాలి. ఇకపోతే మోడీ తీసుకున్న కాంగ్రెస్ ముక్త భారత్ నినాదాం పేలవంగా మారింది. ప్రజలు మోడీ పిలుపునకు పెద్దగా స్పందించడం లేదు. ఎమర్జెన్సీ గురించి ఇంకా మాట్లాడాల్సిన అవసరం లేదు. అయితే ఆనాటి చీకటి రోజులు అంటూ ఉపన్యాసాలు గుప్పిస్తున్నారు. అందుకే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు కొందరు మొగ్గు చూపారు. దీంతో ఆ పార్టీ బలమైన విపక్షంగా ఎదిగింది. పథకాలు, ప్రజల ప్రయోజనాలు పట్టించుకుంటే కాంగ్రెస్ ఎదిగే అవకాశం లేకుండా పోయేది. కేవలం మోడీ హామీలు నినాదాలుగా మారుతున్నాయి. విధానాలు అటకెక్కుతున్నాయి. బిజెపి కన్నా కాంగ్రెస్ మేలన్న వాదన మెల్లగా బలోపేతం కావడానికి పరిస్తితులే కారణమని గుర్తించాలి. ఎన్‌డిఎ మిత్రపక్షాల అండతో మోడీ గద్దెనెక్కారు. అయినా మోడీ తన విధానాలు మార్చుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలు తేడా వస్తే మోడీని గద్దె దింపడానికి వెనకాడరని గుర్తించాలి. చంద్రబాబు గతంలో అలిగి కాంగ్రెస్ జెండా పట్టుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి. అందువల్ల మోడీ క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి సారించాలి. ఉదాహరణకు హైదరాబాద్ మెట్రో విస్తరణ, కంటోన్మెంట్‌లో రోడ్ల విస్తరణ వంటి విషయాల్లో ప్రజల అవసరాలను చూడాలి. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని ప్రజల సమస్యలను విస్మరిస్తే బిజెపికి కీడు జరగగలదు. స్థాని క బిజెపి నేతలు కూడా అభివృద్ధికి సంబంధించి పనుల విషయంలో కీలకంగా ఉండాలి. కేవలం డబుల్ ఇంజిన్ సర్కారే శరణ్యమని కబుర్లు చెప్పడం మానుకోవాలి. మరోవైపు ప్రాంతీయ పార్టీలకు దర్యాప్తు సంస్థల పనితీరు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. కేజ్రీవాల్ తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్న వేళ గుజరాత్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఓ స్థానం గెలవడం ఆశ్చర్యం కలిగించక మానదు. ప్రస్తు పరిస్థితుల్లో ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. లేదా ప్రాంతీయ పార్టీలన్నీ కాంగ్రెస్ గొడుగు కిందకు చేరి బలంగా మారుతాయి. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్ లో టిడిపి, జనసేన కారణంగగా బిజెపి నిలదొక్కుకో గలిగింది. సొంతంగా ఇప్పుడు పోటీ చేసినా ఆ పార్టీకి ఒక్కసీటు కూడా రాదు. కర్ణాటకలో అంతరించిపోయే స్థితిలో జనతాదళ్ (ఎస్) బీజేపీతో చేతులు కలిపింది. నిజానికి కాంగ్రెస్ పార్టీ కంటే మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారే మోనని ఒకరకంగా అనిపిస్తోంది. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్ట కాంగ్రెస్ పార్టీ, శివసేనలను చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్‌ను దెబ్బతీసారు.

# పాపమునకు ప్రాయశ్చిత్తము - మోక్షకారకము హరినామము

## మిడుతూరులో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే





మిడుతూరు, జూన్ 27 (శ్రీచక్ర): భగవన్నామము సకల పాపముల నుండి విముక్తిని కలిగించి, ఉత్తమ గతులను ప్రాప్తింపచేస్తుందని, ఎన్నో జప, తప, హోమాదికాలు చేసినంతటి పుణ్యఫలం ఈ యుగంలో కేవలం భగవన్నామ స్మరణకే కలుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాల జిల్లా, మండల కేంద్రమైన మిడుతూరులోని శ్రీకృష్ణ మందిరం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భాగవతంలోని అజామిళోపాఖ్యానంపై ప్రవచించారు. అంతకు ముందు మూడు రోజులు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై డోన్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి డాక్టర్ తొగట సురేశ్ బాబు చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను తన్మయ పరచినవి. ఈ కార్యక్రమంలో ధర్మప్రచారకులు చెంచు రామ్మోహన్ రావు, భజన మండలి అధ్యక్షులు బన్నూరు రామకృష్ణారెడ్డి, దాలు చిట్టిబాబు, బన్నూరు శ్రీనివాస్ రెడ్డి, భజన నారాయణ, కె. మదన మోహనాచారి, అర్చకులు అన్నమరాజు వెంకట్రామయ్య, మధు, సంపంగి వెంకటేశ్వర్లు, ఆర్.కిరణ్, జనార్దన్ యాదవ్, జె. వెంకటేశ్వర్లు, జయరాములు యాదవ్, శివ, నాగ సుబ్బడు, ధర్మ ప్రచార మండలి సభ్యులు ఎ. శివశంకర్ రెడ్డి,భజన మండలి సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# కష్ట పడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది.

## -టీడీపీ సంస్థాగత కమిటీల నియామక ప్రక్రియలో.. టీడీపీ ఇన్ చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి






మంత్రాలయం జూన్ 27(శ్రీచక్ర) :తెలుగు దేశం పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ ఇన్ చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రైవేటు వసతి గృహంలో ఏర్పాటు చేసిన తెలుగు దేశం పార్టీ సంస్థాగత కమిటీల నియామక ప్రక్రియ సమావేశాన్ని టీడీపీ ఇన్ చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీడీపీ అబ్జర్వర్ లు నెట్టు వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, రామలింగారెడ్డి, మనోహర్ చౌదరి,ఎస్ అప్సర్ బాష హాజరయ్యారు. వారు ముందుగా ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ,చుట్టాలు కదా అని వారి మాట విని పార్టీని తాకట్టు పెట్టొద్దని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గత ఎన్నికల్లో చుట్టాలు చెప్పారని ఓట్లు వైసిపి అభ్యర్థికి ఓట్లు వేయడం వల్లే మన పార్టీ ఓటమి చవి చూసిందని తెలిపారు. చుట్టాలు అయితే మన ఇంటికి వారు రావచ్చు, వారి ఇంటికి మనం కూడా వెళ్లొచ్చు కానీ పార్టీకి మాత్రం మోసం చేయొద్దని హితవు పలికారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నారా లోకేష్ మాటలే మనకు శిరోధార్యమని వారు ఏమి చెబితే అది మనం ఆచరించాలని సూచించారు. పార్టీ ఆవిర్భావం నుంచి జండా మోసిన వారికి అధిష్టానం గుర్తించి తగిన ప్రాధాన్యత ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిపి ఇంచార్జ్ గా అందరినీ కలుపుకుని వెళ్తానని, కలిసి వస్తే శత్రువునైనా చేర దీసి పార్టీ బలోపేతానికి విజయానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నేడు వైసిపి సర్పంచ్ ఉన్న చోట రోడ్డు వేయాలంటే రిజల్యూషన్ పాస్ కావడానికి వారి సంతకం అవసరమని అలాంటప్పుడు అభివృద్ధి ఆగిపోయిందన్నారు. అందువల్ల రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి నుండి గెలుపు సాధించే విధంగా కమిటీలు ఉండాలని పేర్కొన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకుని మండలాలు , నియోజకవర్గాల పరిశీలకులను నియమించి పార్టీ సంస్థాగత స్థాయిలో బలోపేతానికి చంద్రబాబు కృషి చేస్తున్నారని అందులో భాగంగానే నియోజకవర్గ పరిశీలకులుగా డిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశ్వర్లు రామలింగారెడ్డి రామాంజనేయులు మనోహర్ చౌదరి అప్సర్ బాష పర్ల శ్రీనివాసులు, ఉస్సమ్మగారి ప్రసాద్ లను నియమించి ఇక్కడికి పంపిందని విభేదాలు వీడి గ్రామాల్లో కమిటీ సభ్యుల పేర్లతో ఖచ్చితమైన జాబితా తయారు చేసి ఇవ్వాలని జాబితా తయారీలో తేడా వస్తే నేనే మార్చే పరిస్థితి తెచ్చుకోవద్దని హితవు పలికారు. జాబితాలను పరిశీలకులకు పంపడమే తన బాధ్యతని పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు సీనియర్ నాయకులు ముత్తురెడ్డి రామిరెడ్డి గోపాల్ రెడ్డి బసలదొడ్డి ఈరన్న మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య ఏసేపు సతీష్ నాయుడు మల్లికార్జున చావిడి వెంకటేష్ వెంకటపతి రాజు పెద్ద లక్ష్మయ్య అశోక్ రెడ్డి ఎంపిటిసి సభ్యులు ఎంబి వెంకటేష్ కంసాలి నరసింహ పవన్ కుమార్ ఆర్కె రఘు శివ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ రాఘవేంద్రుడికి మొదటి ఆరాధన పత్రిక-ప్రత్యేక పూజలు నిర్వహించిన మఠం అధికారులు



మంత్రాలయం, జూన్ 27(శ్రీచక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో జరుగు 354వ ఆరాధన మహోత్సవం సందర్భంగా మొదటి ఆహ్వాన పత్రికను శ్రీ మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్ శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావనాన్నికి, శ్రీ వాధీంద్ర తీర్థుల బృందావనానికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరాధన మహోత్సవం కార్యక్రమం విజయాన్ని అనుగ్రహించమని భగవంతుని ప్రార్థించారు. త్వరలో ఆరాధన ఆహ్వాన పత్రిక లను ప్రముఖులకు, భక్తులకు, ప్రజలకు అందిస్తామని వారు తెలిపారు

# శా ఫ్ డైరెక్టర్ గా కొవ్వాసు జగదీశ్వరి ప్రమాణ స్వీకారం



జీలుగుమిల్లి జూన్ 27 (శ్రీ చక్ర)ఏలూరు జిల్లా పోలవరం మండల చేగొండపల్లి గ్రామానికి చెందిన కొవ్వాసు జగదీశ్వరి శుక్రవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శాప్ చైర్మన్ రవి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన శాప్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవంలో క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ వారి సమక్షంలో శాప్ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు తీసుకున్న డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి . అనంతరం పత్రికా విలేకరుల సమావేశంలో డైరెక్టర్ జగదీశ్వరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏజెన్సీ ఆదివాసి లకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని నాకు శాప్ డైరెక్టర్ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు



# టీడీపీ సంస్థాగత కమిటీల నియామక ప్రక్రియకు తిక్కారెడ్డి వర్గీయులు దూరం

### -నియోజకవర్గ అబ్జర్వర్ చెప్పిన తిరస్కరించిన తిక్కరెడ్డి వర్గం



మంత్రాలయం ,జూన్ 27,(శ్రీచక్ర) : నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలోని ప్రైవేట్ అతిథిగృహంలో టిడిపి ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ సంస్థాగత కమిటీల నియామక ప్రక్రియ సమావేశానికి కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి వర్గాలు దూరంగా ఉన్నారు. దీంతో టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ అబ్జర్వర్ నెట్టు వెంకటేశ్వర్లు, మండల అబ్జర్వర్ మనోహర్ చౌదరి లు రామచంద్రనగర్ లోని టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, మండలాధ్యక్షులు పన్నగా వెంకటస్వామి , క్లస్టర్ ఎల్లారెడ్డి బీసీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి తో రహస్య చర్చలు జరిపారు . సంస్థాగత కమిటీ నియమానికి రావాలని అబ్జర్వర్ వారిని కోరగా, తిక్కారెడ్డి వర్గీయులు మాకు ఎటువంటి సమాచారం లేదని మేము రావడంలేదని తేల్చి చెప్పారు. టీడీపీ కార్యకర్తలైన మాక టిడిపి ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి వర్గీయులు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల కు మాకు ఆహ్వానం లేదని తిక్కారెడ్డి వర్గీయులు ఆరోపించారు. అనంతరం పలు సమస్యల ను నియోజకవర్గ అబ్జర్వర్ నెట్టు వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా మంత్రాలయం టీడీపీ లో వర్గ పోరు కు స్వస్తి పలక పోతే వచ్చే పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ గెలవడం కష్టమని పలువురు చర్చించుకుంటున్నారు. అంతకుముందు నియోజకవర్గ అబ్జర్వర్ నెట్టు వెంకటేశ్వర్లు కు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి శాలువా కప్పి, శ్రీ రాఘవేంద్ర స్వామి చిత్ర పటాన్ని అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణమోహన్ రెడ్డి , ఏబు , వట్టెప్ప నరసింహ , సుంకప్ప , తదితరులు ఉన్నారు.

# జెడ్పీ పాఠశాలకు ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలి:ఏఐఎస్ఎఫ్




మంత్రాలయం, జూన్ 27(శ్రీచక్ర) :జెడ్పీ పాఠశాలకు ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పిహెచ్ఎస్ పాఠశాల నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ మాట్లాడుతూ, పవిత్ర పుణ్యక్షేత్రమైన మంత్రాలయం జెడ్పీ పాఠశాలలో చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. శ్రీ మఠానికి వచ్చేటటువంటి భక్తులు వాళ్ల వాహనాలను స్కూల్ గ్రౌండ్ లోనే నిలిపివేయడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా కొంతమంది ఆకతాయిలు వలన పాఠశాలలో చదువుతున్నటువంటి విద్యార్థినిలకు రక్షణ లేకుండా పోయింది. జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని అనేకసార్లు ధర్నా నిర్వహించినప్పటికీ ఏ ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా విద్యార్థినీ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని లేనిపక్షంలో భవిష్యత్తులో భారీ ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో ఆఫీస్ లో ఉన్నటువంటి జూనియర్ అసిస్టెంట్ నాగరాజు ఆచారికు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు వీరేష్, దివాకర్, ప్రాణేష్, వినోద్, అరుణాచారి, నాగరాజు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# అనుమానంతో భార్యను చంపిన భర్త

- కుటుంబ కలహాలే కారణం
- ఫిర్యాదు చేసిన మృతురాలు బంధువులు
- కేసు నమోదు చేసిన పోలీసులు

మంత్రాలయం, జూన్ 27,(శ్రీచక్ర) : అనుమానంతో భార్యను చంపిన సంఘటన మండల పరిధిలోని సూగురు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూగురు గ్రామానికి చెందిన బోయ హనుమంతు, గుడికల్లుకు చెందిన లక్ష్మి దేవికి(45) గత 28 సంవత్సరాల క్రితం, వివాహమైంది. భార్యపై భర్తకు అనుమానం ఉండేది. భార్యను శారీరకంగా మానసికంగా, మద్యం సేవించి భార్యను వేధించేవాడని తెలిపారు. తెల్లారిజామున 3 గంటలకు బోయ హనుమంతు భార్య లక్ష్మీదేవిని మేడితోకతో భాదాడంతో తలకు బలంగా తగలడంతో, రక్తం కార్తుండగా కుమారుకుడు లేచి చూసి చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా మరణించినట్లు తెలిపారు. మృతురాలు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## ప్రభుత్వ ఉత్తర్వులను పాటిస్తూ సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**ఈ నెల 30 వ తేదీ నాటికి బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలి**


**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**




కర్నూలు, జూన్ 27 (శ్రీచక్ర): ప్రభుత్వ ఉత్తర్వులను పాటిస్తూ,సచివాలయఉద్యోగులబదిలీలప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్పి.రంజిత్ బాషాటెలికాన్ఫరెన్స్ లో అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం సచివాలయ ఉద్యోగుల బదిలీల బదిలీల అంశం పై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 28, 29 వ తేదీలలో సచివాలయ ఉద్యోగులకి కౌన్సిలింగ్ నిర్వహించి, 30 వ తేది నాటికి ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి అయిన వారికి ఖచ్చితంగా బదిలీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వికలాంగులు, వితంతువులు, స్పౌజ్ కేసులకు సంబంధించి జి.ఓ.ఎం.ఎస్.నెం.4,5 ప్రకారం రిక్వెస్ట్ బదిలీలను చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీల ప్రక్రియలో ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.. అనంతరం ఆయా శాఖల అధికారులతో మాట్లాడి బదిలీలకు సంబంధించి తీసుకుంటున్న చర్యల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. టెలి కాన్ఫరెన్స్ లో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, డీఆర్వో వెంకట నారాయణమ్మ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ ఎస్ ఈ రామచంద్రా రెడ్డి, డి ఎం హెచ్ ఓ శాంతి కళ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, డిపిఓ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలి

**ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**




కర్నూలు, జూన్ 27 (శ్రీచక్ర): ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా కలెక్టరేట్ లో ఉన్న ఈవీఎం గోడౌన్ ను శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఈవీఎంయంత్రాలు, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, రాజకీయ పార్టీ ప్రతినిధులు బిజెపి తరపున సాయి ప్రదీప్ , జనసేన పార్టీ తరపున మంజునాథ్, బహుజన సమాజ్ వాదీ పార్టీ డిస్టిక్ ఇంచార్జ్ అరుణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ తరపున తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్ పి.రాజు, కాంగ్రెస్ పార్టీ తరపున బజారన్న పాల్గొన్నారు.

## నగరంలో ఉన్న జగన్నాథ గట్టు వద్ద కుడా నిధులతో పర్యాటక పరంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

**కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు**

కర్నూలు, జూన్ 27 (శ్రీచక్ర): నగరంలో ఉన్న జగన్నాథ గట్టు వద్ద కుడా నిధులతో పర్యాటక పరంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు జిల్లా పర్యాటక శాఖ అధికారిని ఆదేశించారు. శుక్రవారం నగరంలోని చాణిక్యపురి కాలనీలో ఉన్న కుడా కార్యాలయంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి కుడా బోర్డ్ సమావేశాన్ని కుడా వైస్ ఛైర్మన్, జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య నిర్వహించారు. ఈ సందర్భంగా కుడా పరిధిలో పలు గ్రామాల్లో జరిగిన పనులపై చర్చించారు. నగరంలో ఉన్నటువంటి జగన్నాథ గట్టు వద్ద చిల్డ్రన్ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కుడా చైర్మన్ జిల్లా పర్యాటక శాఖ అధికారిని ఆదేశించారు. అదే విధంగా మాదకద్రవ్యాలను నియంత్రించేందుకు గాను పోలీస్ శాఖకు డ్రోన్ ల మంజూరుకు బోర్డు ప్రతిపాదించడం జరిగిందన్నారు. సమావేశంలోఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కిషోర్ రెడ్డి, డిటిసి శాంత కుమారి, డిఏఓ శ్రీనివాసులు, కుడా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి**

**నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు ఆదేశాలు**





కర్నూలు, జూన్ 27 (శ్రీచక్ర): నగరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సమర్ధవంతంగా ఉపయోగించుకుంటూ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (యన్‌క్యాప్) పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, జాప్యం చేయకుండా సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన నగరంలో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. యన్‌క్యాప్ కార్యక్రమం ద్వారా సుంకేసుల రోడ్డు, మద్దూర్ నగర్, బి.క్యాంపు పోస్ట్ ఆఫీస్ నుండి సి.క్యాంపు టిటిడి కళ్యాణ మండపం వరకు, బి.క్యాంపు విజ్ఞన్ మందిర్ ప్రాంతాల్లో రహదారి ఇరువైపులా ఖాళీ ప్రదేశాలపై రహదారుల నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. గాయత్రీ ఎస్టేట్ కూడలి కుదింపు, కిమ్స్ ఆస్పత్రి రహదారిలో విభాగినిల్లో మొక్కలు నాటుట, సుద్దవాగు పూడికతీత పనులు పూర్తి చేయవల్సిన పనులను కమిషనర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను మెరుగుపరచడానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, డిఈఈ గిరిరాజ్, మనోహర్ రెడ్డి, నరేష్, బిల్డింగ్ సూపర్వైజర్ అంజాద్ బాష, ట్రైనీ ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి కృషి చేయండి

**నీతి ఆయోగ్ సీఈవో బి.వి.ఆర్. సుబ్రమణ్యం**



కర్నూలు , జూన్ 27 (శ్రీచక్ర): జిల్లాలలో గుర్తించబడిన ఆస్పిరేషనల్ బ్లాక్ ల అభివృద్ధి కృషి చేయాలి అని నీతి ఆయోగ్ సీఈవో బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఢిల్లీ నీతి ఆయోగ్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ను నీతి ఆయోగ్ సీఈవో బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం నిర్వహించారు. ఈ సందర్భంగా సీ.ఈ.వో మాట్లాడుతూ... దేశంలో గుర్తించిన 329 జిల్లాలలోని 500 ఆస్పిరేషనల్ బ్లాక్ లను జిల్లా కలెక్టర్లు అభివృద్ధి చేయాలని ఆదేశించారు. వ్యవసాయం , విద్య , నీటి సౌకర్యాలు , స్కిల్ డెవలప్మెంట్ , పోషకాహారం అందించడం , అంగన్వాడీ కేంద్రాలు మొదలగు వాటిని వెంటనే అభివృద్ధి చేయాలని ఆదేశించారు. గుర్తించబడిన బ్లాక్ లలో అన్ని మౌలిక సౌకర్యాలు సంతృప్తి స్థాయికి వరకు కల్పించే చర్యలు తీసుకోవాలని వాటికి అవసరమైన నిధులు సమకూరుస్తామని తెలియజేశారు. సరికొత్త ఆలోచనలతో అభివృద్ధికి తీసుకునే చర్యల నివేదికలు పంపినట్లయితే వాటిని పరిశీలించి , ఆమోదంచి నిధులు సమకూర్చడం జరుగుతుందని , వీటి ద్వారా బ్లాకులు మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మంచి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆస్పిరేషన్ జిల్లాల డెల్టా ర్యాంక్స్ ను ప్రకటించారు. భవిష్యత్తులో నెలవారి మరియు త్రైమాసిక ర్యాంకులు , అవార్డులు ప్రకటిస్తామని ఇందులో రెండున్నర కోట్ల రూపాయలు మరియు మూడు కోట్ల రూపాయల విలువైన ప్రోత్సాహకాలు ఉంటాయని తెలియజేశారు. జిల్లా కలెక్టర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బ్లాక్ ల అభివృద్ధికి సంపూర్ణంగా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి గీతాంజలి గుప్తా అడిషనల్ సెక్రటరీ నీతి ఆయోగ్ , నీతి ఆయోగ్ మెంబర్ వినోద్ కుమార్ పాల్ పాల్గొని పలు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులతో మాట్లాడుతూ... జిల్లాలో ఆస్పిరేషనల్ బ్లాక్ ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు వచ్చేలా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సాధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు నీతి ఆయోగ్ వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, హౌసింగ్ పీడీ చిరంజీవి, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి , జెడి అగ్రికల్చర్ వరలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జెడి శ్రీనివాసులు,ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీఈవో శామ్యూల్ పాల్, ,డిప్యూటీ డి ఎం హెచ్ ఓ భాస్కర్, ఐ సి డి ఎస్ పిడి నిర్మల, డిడి గ్రౌండ్ వాటర్ శ్రీనివాస రావు, జిల్లా అస్పిరేషనల్ బ్లాక్స్ మండల కోఆర్డినేటర్ లు, తదితరులు పాల్గొన్నారు.

## నేర నియంత్రణ, ప్రజలకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యంగా పని చేయాలి

**అత్యాధునిక సాంకేతికతను వినియోగించాలి**

**జిల్లా వ్యాప్తంగా రాత్రి వేళల్లో గస్తీని పటిష్ట చేయాలి**

**మహిళలపై జరిగే నేరాల నివారణకు గట్టి చర్యలు చేపట్టాలి**

**జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**






కర్నూలు, జూన్ 27 (శ్రీచక్ర): శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.ఈ సంధర్భంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైల తో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులతో మాట్లాడారు. కర్నూలు , పత్తికొండ , ఆదోని , ఎమ్మిగనూరు సబ్ డివిజన్ లలో ఉన్న పెండింగ్ కేసుల గురించి జిల్లా ఎస్పీ సమీక్షించి ఆరా తీశారు. పోలీసుస్టేషన్ల వారీగా కేసుల పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. అత్యాధునిక సాంకేతికతను వినియోగించి నేరాల కట్టడికి గట్టిగా పని చేయాలన్నారు. పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించే విధంగా అన్ని స్థాయిల అధికారులు కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసులలో ముద్దాయిల అరెస్టు గురించి ఆరా తీశారు. ప్రాధాన్యత గల కేసులలో ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా భాదితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీలు బాగా చేయాలన్నారు. (ఎంఎస్సీడీ) మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ తో రాత్రి గస్తీలలో అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల వేలి ముద్రలను సేకరించి, వాటిని నేర రికార్డులతో సరిపోల్చి నేరగాళ్ళను పట్టుకోవాలన్నారు. నేర పరిశోధనలలో నిందితులను గుర్తించడంలో వేలి ముద్రల విశ్లేషణ యొక్క ప్రాముఖ్యత చాలా ఉందన్నారు. సిసియస్ పోలీసులు బాగా పని చేయాలన్నారు. దొంగతనాల నివారణకు , ప్రాపర్టీల రీకవరికి కృషి చేయాలన్నారు. బేసిక్ పోలీసింగ్ లో భాగంగా పోలీసు అధికారులు పాటించాల్సిన విధులు, నైతిక ప్రమాణాలు, రోల్ కాల్స్, చట్టాన్ని అమలు చేయడంలో ప్రజలకు న్యాయం చేయాలన్నారు. డయల్ 100 బాగా పని చేయాలన్నారు. పోక్సో కేసులలో నివేదికలు త్వరగా సిద్దం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలన్నారు. రోడ్డు ప్రమాదాల మలుపులు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అడ్డుగా ఉన్న కంప చెట్లను తొలగించాలన్నారు. రేడియం స్టిక్కర్స్, బారికేడ్స్, జిగ్ జాగ్ డ్రమ్స్ , స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. మిస్సింగ్ కేసులు, పోక్సో, మహిళల పై జరిగే నేరాల నివారణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇటువంటి విషయాల పట్ల పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండే విధంగా పోలీసు అధికారులు బ్రీఫింగ్ చేయాలన్నారు. సచివాలయ మహిళా పోలీసుల విధుల గురించి ఆరా తీశారు. విధుల పట్ల వారి సేవలను సద్వినియోగం చేసుకునేవిధంగా చూడాలన్నారు. అనంతరం గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ నేర సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు , హేమలత , ఏ ఆర్ డి ఎస్ పి భాస్కర్ రావు , సిఐలు , ఎస్సైలు పాల్గొన్నారు.

## 29 న శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానం స్వచ్ఛభారత్ స్వచ్ఛ మందిర్

కర్నూలు, జూన్ 27 (శ్రీచక్ర): శ్రీషిరిడి సాయిబాబా దేవస్థానం దక్షిణ షిరిడి కర్నూలు నుండి. జులై 10 వ తేదీన గురువారం గురుపౌర్ణమి వేడుకలు పురస్కరించుకుని ఈ నెల 29.6.25 ఆదివారం రోజు స్వచ్ఛభారత్ స్వచ్ఛ మందిర్ కార్యక్రమంలో భాగంగా దేవాలయమును పరిశుభ్రం చేసే కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. కావున ఈ కార్యక్రమానికి సాయి భక్తులు, సాయి సేవకులు, సాయి దీక్ష పరుగు సత్సంగ సభ్యులు మరియు మహిళా సేవకులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరడమైనది. సమయము ఉ.8.00 అల్పాహారము, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని దక్షిణ షిరిడి సాయిబాబా దేవస్థానం ఆలయ పాలక మండలి కోశాధికారి ఎస్జీ.మహాబలేష్ తెలిపారు.

## రాజకీయ విభేదాలు పక్కన పెట్టండి

**ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి**


**కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపకులు ఎం. శ్రీహర్ష డిమాండ్**





కర్నూలు, జూన్ 27 (శ్రీచక్ర): రాజకీయ విభేదాలు పక్కన పెట్టండి. ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి, కరువు నిర్మూలనకు ప్రాజెక్టుల నిర్మాణం అత్యవసరం.చెరువులను నింపాలి. వలసలు ఆగుతాయి. జిల్లా సస్యశ్యామలం అవుతుంది. గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి. కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపకులు శ్రీ హర్ష, రైతు సంఘం జేఏసీ నాయకులు, రామకృష్ణ, శ్రీనివాసరావు, రవి, సుంకన్న , రఘులు డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావులు కోరారు. శుక్రవారం కర్నూల్ నగరంలోని బిర్లా కాంపౌండ్ నందు కర్నూలు ప్రగతి సమితి కార్యాలయంలో వ్యవస్థాపకులు ఎం. శ్రీహర్ష ఆధ్వర్యంలో రైతు సంఘాల జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో సాగు, త్రాగునీటి ఆవశ్యకతపై చర్చించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జేఏసీ నాయకులు మాట్లాడుతూ కరువు నిర్మూలనకు ప్రాజెక్టుల నిర్మాణం అత్యవసరమని, సాగుకు నీరు లేనందు వల్లే ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టినందువల్లే కరువుకు గురవుతున్న సంఘటనలు జరుగుతున్నాయని, గుండ్రేవుల, వేదవతితో పాటు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ప్రగతి సమితి నాయకులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అన్న దానానికి రూ. 2.50 లక్షల విరాళం



మంత్రాలయం, జూన్ 27(శ్రీచక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి ఆగస్టు నెలలో జరుగు 354 ఆరాధన మహోత్సవాలు సందర్భంగా 11 వ తేదీన జరిగే మధ్యారాధన సందర్భంగా భక్తులకు అన్న దానానికి గాను కొయంబత్తూరుకు చెందిన భక్తుడు గౌతం రూ. 2.50లక్షలు విరాళం అందజేసినట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. ఆయనకు పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థలు వారికి ఆశీస్సులు అందజేశారని మేనేజర్ తెలిపారు.

శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY

శనివారం జూన్ 28 2025

# మంత్రి సుభాష్ రైతు బజార్ ను ఆకస్మికంగా పరి-శీలీలన.

## రైతుల యోగ క్షేమాలు, నిర్వహణపై ఆరా.





రామచంద్రపురం, జూన్ 27( శ్రీచక్ర)రైతులందరూ బాగున్నారా మీ వ్యాపారాలు ఎలా సాగుతున్నాయి రైతు బజార్లో సౌకర్యాలు అన్నీ బాగున్నాయా అంటూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రైతులను కుశల ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. రామచంద్రపురంలో సుమారు దశాబ్ద కాలం తర్వాత ఇటీవల రూ. 80 లక్షల నిధులు వెచ్చించి 28 షాపులతో రైతు బజార్ నిర్మించి మంత్రి సుభాష్ చేతులమీదుగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. రామచంద్రపురంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు అందుబాటు ధరలలో నాణ్యమైన, తాజా కూరగాయలు అమ్ముకునే విధంగా రైతు బజార్ ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం మంత్రి ఆకస్మికంగా రైతు బజార్ ను సందర్శించి అక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. రైతులు అందరిని ఆప్యాయతో పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడగడం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేశారు. రైతు బజార్ ఏర్పాటు పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రైతు బజార్ నిర్వహణపై రైతులందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. రైతు బజార్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సుభాష్ చొరవతో దశాబ్ద కాలం తర్వాత రైతు బజార్ ఏర్పాటు కావడంతో అటు ప్రజలు, ఇటు రైతుల్లోను హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. మంత్రి సుభాష్ వెంట పలువురు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికిప్రాధాన్యత.

## ప్రజాదర్బార్ లో అర్జీలు స్వీకరించిన మంత్రి సుభాష్





రామచంద్రపురం, జూన్ 27( శ్రీ చక్ర) ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే ప్రభువులని, వారి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక- ప్రజా దర్బార్ నిర్వహించి వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలు విని, తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంపై అపారమైన నమ్మకంతో, విశ్వాసంతో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వానికి అండగానిలిచిఅత్యధికవిజయం చేకూర్చారని, వారి సమస్యలు పరిష్కరించడం మా బాధ్యత అన్నారు. ప్రజల పక్షాన, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా అమరావతి లోను, నియోజకవర్గాల్లోనూ ప్రజాదర్బార్లు నిర్వహించి నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేందుకు వెనుకాడ బోదన్నారు. రామచంద్రపురం నియోజవర్గంలోని పలు గ్రామాల ప్రజలు ప్రజా దర్బార్ కు హాజరై వినతి పత్రాలు అందించారు. ఇదిలా ఉంటే మంత్రి సుభాష్ ప్రభుత్వ పరంగానే కాకుండా సామాజిక బాధ్యతగా తన తండ్రి చైర్మన్ గా ఉన్న "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" ద్వారా, వ్యక్తిగతంగా అనేక సంక్షేమ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుండడంతో అర్జీ దారులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.

# ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి ఆధ్వర్యంలో పిల్లలకు ఉచితంగా విద్యా సామాగ్రి పంపిణీ





అన్నమ్మయ్య,జూన్ 27(శ్రీచక్ర): సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డా. కొప్పుల విజయ్ కుమార్ ఆదేశాల మేరకు అన్నమ్మయ్య జిల్లా మహిళా విభాగం వైస్ చైర్మన్ మరియు టిడిపి మండల నాయకురాలు సి.ఎస్.సౌభాగ్యవతిపుల్లంపేటమండంలోని సీతారంపేట, పెరియవరంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పిల్లలకు అవసరమైన విద్యా సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సౌభాగ్య మాట్లాడుతూ తాము గత కొన్ని సంవత్సరాలనుండి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా సీతారామ్ పేట మరియు పెరియవరం పాఠశాలల్లో ఉచితంగా బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిల్లు తదితర విద్యా సామాగ్రిని అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో పెరియవరం ఉపాధ్యాయులు మురళి, సుబ్బలక్ష్మి, సీతారం పేట ప్రధానోపాధ్యారాలు ఎన్. పి మాదవిలు పాల్గొని సౌభాగ్యను అభినందించారు.

# ఇంజనీరింగ్ విద్యార్థినికి మంత్రి సుభాష్ ఆర్థిక సాయం

కాజులూరు,జూన్27( శ్రీచక్ర)రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండలంశీల గ్రామానికిచెందినఇంజనీరింగ్చదువుతున్న ముమ్మిడి వెంకట మాధవికు రాష్ట్రకార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. మాధవి చిన్ననాటి నుంచి చదువులో అగ్రస్థానంలో ఉత్తీర్ణత సాధిస్తూ వస్తుంది.మాధవికుటుంబం ఆర్థికంగా వెనుకబడి ఉన్నకారణంంగామండలకూటమినాయకులుమంత్రి సుభాష్ దృష్టికి తీసుకెళ్లగామంత్రిస్పందించితక్షణ సాయంగా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించి బాగా చదువుకొని ఉన్నత స్థితికి ఎదగాలని ఆశీస్సులు అందించి ప్రోత్సహించారు.భవిష్యత్తులోవిద్యకుసంబంధించిఏ అవసరం వచ్చినా తాను తప్పక సహాయంఅందిస్తాననిహామీఇచ్చారు. మంత్రి సుభాష్ వెంట యాళ్ళ కృష్ణారావు, అన్యం శ్రీరామ చంద్ర మూర్తి,కూటమి పార్టీ నాయకులు,గ్రామ పెద్దలు తదితరులున్నారు. రామచంద్రపురం నియోజవర్గంలోని నిరుపేద విద్యార్థులకోసంఆర్థి కసహాయంచేయుడ ేమేకాక, నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు జాబ్ మేళా నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# నూతన సాంకేతికతను మరియు అవకాశాలను అందిపుచ్చుకుని ఎంఎస్ఎంఈ లు మరింతగా ఎదగాలి

## రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, పరిమిత ఉద్యోగ కల్పనలో ఎం ఎస్ ఎం ఈ ల పాత్ర అభినందనీయం: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

తిరుపతి,జూన్ 27(శ్రీచక్ర)నూతన సాంకేతికతను మరియు అవకాశాలను అందిపుచ్చుకుని ఎం ఎస్ ఎం ఈ లు మరింతగా ఎదగాలని రాష్ట్ర ఎం ఎస్ ఎం ఈ , సెర్ప్,ఎన్ ఆర్ ఐ సాధికారత మరియు సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమల దినోత్సవం 2025 కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం స్థానిక తాజ్ హోటల్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.పి. సోమనాథ్,రాష్ట్ర ఎం ఎస్ ఎం ఈ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ తమ్మి రెడ్డి శివశంకర రావు, జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ , రాష్ట్ర ఎం ఎస్ ఎం ఈ డెవలప్మెంట్ కార్పోరేషన్ సి.ఈ.ఓ. ఎం.విశ్వ, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు,సత్యవేడు ఎం ఎల్ ఎ కోనేటి ఆదిమూలం,మాజీ ఎం ఎల్ ఎ సుగుణమ్మ లతో కలిసి మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన సాంకేతికతను మరియు అవకాశాలను అందిపుచ్చుకుని ఎం ఎస్ ఎం ఈ లు మరింతగా ఎదగాలన్నారు. ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవాన్నితిరుపతిలోనిర్వహిస్తున్నందుకు తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అన్ని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా



పరిశ్రమల ప్రతినిధులకు మంత్రి హృదయ పూర్వక అభినందనలు తెలియ జేశారు.గురువారం జరిగిన రివర్స్ బయ్యర్ - సెల్లర్స్ మీట్ లోపాల్గొన్న వారిని కూడా ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు.ఈ సంవత్సరానికి ఎంఎస్ఎంఈ డే థీమ్ అయిన "సస్టైనబుల్ గ్రోత్ మరియు ఇన్నోవేషన్కు ఎంఎస్ఎంఈ ల పాత్రను పెంపొందించడం" పై ఎస్.పి. సోమనాథ్ ప్రసంగం అత్యంత ప్రేరణాత్మకంగా ఉందన్నారు. టెక్నాలజీ స్వీకరణ,పరిశ్రమ పునరుజ్జీవన మరియు ఇవి ల అభివృద్ధికి ఆయన సూచనలు అమూల్యమైనవన్నారు.ఎంఎస్ఎంఈ చైర్మన్ శివ శంకరరావు తమ్మిరెడ్డి రంగానికి సంబంధించి పలు అంశాలపై గౌరవంగా పనిచేస్తున్నారని రివర్స్ బయ్యర్ -సెల్లర్స్ మీట్ ను విజయవంతం చేయడంలో ఆయన పాత్ర కీలకమైనదన్నారు.తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఎంతో ఉత్సాహంగా తోడ్పాటును అందిస్తున్నారని ఆయన భాగస్వామ్యం ఎంఎన్ఎంఈ లకు ప్రేరణగా నిలుస్తుందన్నారు.అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి, సత్యవేడు ఎం.ఎల్.ఎ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈరోజు అనేక సంస్థలు ఎంఎస్ఎంఈ లను మద్దతు ఇవ్వడానికి జ్ఞాపకార్థక ఒప్పందాలపై సంతకాలు చేశారని,ముఖ్యంగ నేషనల్ స్టాక్ఎక్స్చేంజ్ తో కుదిరిన ఒప్పందం కీలకమైన అడుగని, ఫైనాన్సింగ్లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తుందన్నారు.

# శ్రీసిటీ-ఐసాన్ పరిశ్రమ వితరణతో నిర్మించిన విద్యావసతుల ప్రారంభం

శ్రీసిటీ,జూన్ 27(శ్రీచక్ర):శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో (సీఎస్ఆర్) భాగంగా శ్రీసిటీలోని జపాన్ పరిశ్రమ ఐసాన్ ఆటో పార్ట్స్ ఇండియా సుమారు 18.80 లక్షలతో నిర్మించిన వివిధ విద్యా వసతులను ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ యసనోరి సకావే, శ్రీసిటీ డైరక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ విద్యా వసతులలో సూళూరుపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్ లో 6.50 లక్షల ఖర్చుతో అదనపు మరుగుదొడ్లు,వంట గది నిర్మాణం, సత్యవేడు మండలం రామచంద్రపురం గ్రామంలో 12.30 లక్షల వ్యయంతో నూతన అంగన్వాడీ భవనం నిర్మించారు.ఈ సందర్భంగా ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ యసనోరి సకాయి మాట్లాడుతూ విద్యా వసతుల కోసం సీఎస్సార్ కార్యక్రమాలు చేపట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ తరహా మరిన్ని విద్యాభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యులు అవుతామనని చెప్పారు.ఐసాన్ పరిశ్రమ సీఎస్సార్ చొరవను ప్రశంసించిన నిరీషా సన్నారెడ్డి, విద్య,ఆరోగ్య సంరక్షణ మౌళిక సదుపాయాలను బలోపేతం చేయడంలో శ్రీసిటీ ఫౌండేషన్ నిబద్ధతను పునరుద్ఘాటించారు.విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని







చదువుల్లో రాణించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో ఐసాన్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ యూచి టొమిట, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ గోపాల్, ప్రొడక్షన్ కోఆర్డినేటర్ తోషిహిరో సనా,మ్యానుఫ్యాక్చరింగ్ డిజిఎం దేవనాథన్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.600 పైచిలుకు విద్యార్థినిలున్న సూళూరుపేట హైస్కూల్లో గతంలో 12 మరుగుదొడ్లు మాత్రమే ఉండేవి. అవి సరిపోక పిల్లలు ఇబ్బందులకు గురయ్యేవారు.అలాగే రామచంద్రాపురంలో గతంలో ఒకే భవనంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ తరగతులు నిర్వహించేవారు.విద్యార్థుల సంఖ్య పెరగడంతో స్థలాభావం ఏర్పడింది.నూతన వసతుల ఏర్పాటుతో ఈ సమస్యలకు పరిష్కారం లభించింది. విద్యా వసతుల పట్ల స్కూల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు.శ్రీసిటీ ఫౌండేషన్ మరియు ఐసాన్ కంపెనీ యాజమాన్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# జగన్నాథ రథయాత్ర సంబరం

## భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

## తీరం వెంట సిసి కెమరాలతో పర్యవేక్షణ

పూరి,జూన్27 : ఒడిశాలోని పూరీలో జగన్నాథ రథయాత్ర అట్టహాసంగా, శోభాయమానంగా ప్రారంభమైంది. ఏటా ఆషాఢ మాసం శుక్ల పక్ష ద్వితీయ తిథి పర్వదినాన జగన్నాథుని రథయాత్రను చేపడతారు. ఈ విశ్వవ్యాప్త భారీ రథయాత్రను వీక్షించేందుకు ఇందులో పాల్గొనేందుకు దేశవిదేశాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. పూరీనగర వీధులన్నీ జై జగన్నాథ్! అనే భక్తుల నినాదాలతో ప్రతిధ్వనించాయి. భారీ జనసందోహం రాకను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంతం వెంబడి విస్తృత స్థాయిలో బలగాలను మోహరించింది. నగరాన్ని హై-సెక్యూరిటీ జోన్గా మార్చారు. ఎఐ ఆధారిత నిఘా, రియల్ టైమ్ టెక్నాలజీతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సుందరరథంపై కొలువుదీరిన జగన్నాథుడు, ఆయన సోదరుడు బలభద్రుడు, సోదరి దేవి సుభద్రలు గుండిచా ఆలయానికి ఊరేగింపుగా తరలివెళతారు. ఇక్కడ జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్రలు వారం రోజుల పాటు సేదతీరతారు. ఆ తర్వాత బహుదా యాత్ర ద్వారా ప్రధాన ఆలయానికి తిరిగి వస్తారు. కాగా, ఈ భారీ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రభుత్వ యంత్రాంగం అత్యాధునిక భద్రతా ఏర్పాట్లను పూర్తిచేసింది. పదివేలకు పైగా సిబ్బందిని తీరం వెంట మోహరించింది. కీలక ప్రాంతాలలో 275 కంటే ఎక్కువ ఎఐ ఆధారిత సిసి కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. భారీ జనసందోహం పాల్గొంటున్నందున్నఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించడానికి ఒడిశా పోలీసులు ఎనిమిది కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు దళాలతో సహా సుమారు 10,000 మంది సిబ్బందిని మోహరించారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ స్నిపర్ల సాయంతో గ్రాండ్ రోడ్డు వెంబడి రక్షణ బాధ్యతలను చేపట్టారు. తీరప్రాంత భద్రతను కోస్ట్ గార్డ్, భారత నావికాదళం నిర్వహిస్తున్నాయి. భద్రతా కార్యకలాపాలను పర్యవేక్షించడానికి పూరీలో తొలిసారిగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ను ఏర్పాటు చేశారు. ఒడిశా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వైబి ఖురానియా మాట్లాడుతూ, రియల్ టైమ్ పర్యవేక్షణ కోసం పట్టణం అంతటా, కోణార్క్కు వెళ్లే మార్గాల్లో 275 కి పైగా ఎఐ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసు డ్రోన్లు, బాంబు స్క్వాడ్లు, యాంటీ-సాబోటేజ్ బృందాలు, డాగ్ స్క్వాడ్లు, మెరైన్ పోలీసులు కూడా విస్తృతమైన ఏర్పాట్లలో భాగమయ్యారు. ఉరుములు, ఈదురుగాలులు వీచే అవకాశమున్నందున, భారత వాతావరణ శాఖ పూరీతో సహా అనేక జిల్లాల్లో భక్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. కాగా, రథయాత్రకు ఒక రోజు ముందు వేలాది మంది భక్తులు 'నవయవ్వన దర్శనం' లో పాల్గొన్నారు. దేవతల కళ్లకు రంగులు వేసే 'నేత్రోత్సవం' వీక్షించగలిగారు. రహస్య మందిరంలో15 రోజుల పాటు దేవతలను ఉంచాక ఆచారం ప్రకారం జూన్ 11న భక్తులకు ఈ దర్శనం చేసుకునే అవకాశం లభించింది.



# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని పార్లమెంటులో లేవనెత్తుతా

## కెసిఆర్, కెటిఆర్ ఇద్దరూ జైలు కెళ్లాల్సిందే: కొండా

హైదరాబాద్,జూన్27 ): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కెసిఆర్, కెటిఆర్ ఇద్దరూ జైలుకు వెళ్లాల్సిందేనని భాజపా ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి అన్నారు. ఈ నేరం తక్కువ చేసి చూడరాదన్నారు. ట్యాపింగ్ పై ఫిర్యాదు చేసినందుకే తనపై తప్పుడు కేసులు పెట్టారని భాజపా ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసినందుకు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ జైలుకు వెళ్లాలన్నారు. ఈ కేసు విచారణలో భాగంగా శుక్రవారం ఆయన సిట్ ఎదుట హాజరయ్యారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఆయన్ని అధికారులు ప్రశ్నించారు. వాంగ్మూలం నమోదు చేసుకున్నారు.అనంతరం విశ్వేశ్వర్రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ నిరూపించేందుకు అవసరమైతే కేంద్రం సాయం తీసుకోవాలన్నారు. 'ఈ అంశాన్ని పార్లమెంట్లో లేవనెత్తుతాం. మళ్లీ ఫోన్ ట్యాపింగ్ జరగకుండా ఉండాలంటే కేసీఆర్, కేటీఆర్కు శిక్షపడాలి. గతంలో నా ఫోన్ చాలాసార్లు ట్యాప్ అయ్యింది. దీనిపై గతంలోనూ నేను ఫిర్యాదు చేశాను' అని విశ్వేశ్వర్రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ విశ్వేశ్వర్రెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయినట్లు అధికారులు కూడా గుర్తించారు. సీడీఆర్ లిస్టులో ఆయన నంబర్ ఉన్నట్లు సిట్ తెలిపింది.



# చంద్రబాబు వ్యాఖ్యలు..విశ్వాసం పెంచేందుకేనా



విజయవాడ, జూన్ 27, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫుల్లు కాన్ఫిడెన్స్ లో ఉన్నారు. ఆయన ఎక్కడకు వెళ్లినా ఒక మాట మాత్రం ఖచ్చితంగా చెబుతున్నారు. మళ్లీ ఆ భూతాన్ని రానివ్వనంటూ వివిధ వర్గాల వారికి హామీ ఇస్తున్నారు. అంటే జగన్ ఇక జన్మలో ముఖ్యమంత్రి కారని చంద్రబాబు ఫిక్స్ అయినట్లే కనిపిస్తుంది. తాజాగా ఫిక్కీ సమావేశంలోనూ జగన్ పేరు ఎత్తకుండా ఆ భూతాన్ని మళ్లీ రానివ్వనని, నాది హామీ అంటూ పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. కొత్త రాష్ట్రంలోనూ, నూతన రాజధానిలోనూ పెట్టుబడులు సమకూరాలంటే ఖచ్చితంగా అలాంటి హామీ ఇవ్వాల్సిందేనని, అందుకే చంద్రబాబు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుండ ఉండి ఉండవచ్చు అన్న విశ్లేషణలు వినపడుతున్నాయి.. రాకుండా అడ్డుకోవడానికి చంద్రబాబు వల్ల సాధ్యం కాదు. కాకపోవచ్చు కూడా. అధికార పార్టీ అది ఏదైనా.. వైసీపీ అయినా టీడీపీ అయినా మరొకటి అయినా ప్రజలు మార్పు కోరుకుంటారు. రానివ్వకుండా ఉండేది ఓటర్లు మాత్రమేనని వైసీపీ నేతలు అంటున్నారు. చంద్రబాబు చేసే పనులను ప్రజలు గమనిస్తున్నారని, ఏడాదిలోనే ఒక ప్రభుత్వంపై ఇంతటి వ్యతిరేకత వ్యక్తమవ్వడం ఎక్కడా చూడాలేదని వైఎస్ జగన్ సాక్షాత్తూ వ్యాఖ్యానించారు. అధికార పార్టీపై సహజంగా వ్యతిరేకత ఉంటుంది. ఎంత మంచి చేసినా కొందరికే అందుతుంది. మిగిలిన వారిలో అసంతృప్తి రగులుతుంది. మరొకవైపు ఎమ్మెల్యేలపై పెరిగే అసంతృప్తి ఎన్నికల సమయానికి కాని తెలియదు.. వైసీపీ అధినేత జగన్ కూడా ఆ అసంతృప్తిని గమనించి చాలా మంది ఎమ్మెల్యేలను మొన్నటి ఎన్నికల్లో నియోజకవర్గాలనే మార్చారు. మంత్రులను కూడా వదిలిపెట్టకుండా షిఫ్ట్ చేసేశారు. అయినా అలా మార్చిన వారిలో ఎవరూ గెలవకపోవడం ఇక్కడ చూడాలి. ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరును కూడా ప్రజలు బేరీజు వేసుకుంటారు. ఏపీ ఎన్నికలు పార్లమెంటు, అసెంబ్లీ ఒకేసారి జరుగుతాయి కాబట్టి తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం పనితీరు ప్రభావం కూడా కొంత పడుతుంది. అది అడ్వాంటేజిగా మరుతుందా? లేక అదే ఇబ్బందిగా తలెత్తుతుందా? అన్నది ఫలితాల తర్వాత మాత్రమే తేలుతుంది. అంతే కాని నేతల చేతుల్లో ఒకరి గెలుపును అడ్డుకోవడమంటే ఇప్పటికీ కొందరే దశాబ్దాల నుంచి ముఖ్యమంత్రులుగా చెలామణి అయ్యేవారు. తమిళనాడు వంటి రాష్ట్రంలో బీజేపీ ఇప్పటి వరకూ కాలుమోపకపోవడాన్ని కూడా ఉదహరిస్తున్నారు. అది ఎన్ని ట్రిక్కులు ప్లే చేసినా చివరకు తమిళనాడు విషయానికి వచ్చేసరికి రాజకీయంగా ఇబ్బంది పడుతుంది. అక్కడ పొత్తులు కూడా పనిచేయడం లేదు. తెలంగాణలోనూ సుదీర్ఘకాలం నుంచి చేస్తున్న పోరాటం విజయం వైపు నడవలేదు. మహారాష్ట్రలో ఒకసారి బీజేపీని కూడా కాదని అక్కడ కాంగ్రెస్ కూటమికి ప్రజలు పట్టం కట్టిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అందుకే నేతల చేతుల్లో ఒకరి గెలుపు ఆపడం సాధ్యపడదని, అయితే ఆ మాత్రం నమ్మకం లేకపోతే ముందుకు వెళ్లలేక అలా చెప్పుకుంటూ వెళతారన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. మూడు పార్టీలు కలిసినా విజయం సాధిస్తాయన్న నమ్మకం ఉండదు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత మూడు పార్టీలపై పడుతుంది.నిరుద్యోగులకు అనలైన పండగ అందరూ కార్యకర్తలకు... తెలంగాణలో వరసగా రెండు సార్లు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడోసారి కూడా తమదే విజయమని కేసీఆర్ ధీమాగా ఉన్నారు. తానే శాశ్వత ముఖ్యమంత్రి భ్రమించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలను పెద్దగా మార్పు చేయకుండానే ఎన్నికలకు వెళ్లి చేతులు కాల్చుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇక కార్యకర్తలకు అందరికీ న్యాయం జరగదు. ఏ పార్టీ అయినా కొందరికే వారి అవసరాలను తీర్చగలుగుతుంది. స్థానిక ఎమ్మెల్యేలు కూడా వేల సంఖ్యలో ఉన్న ముఖ్యమైన కార్యకర్తలను మెప్పించడం ఏ ప్రభుత్వానికి సాధ్యం కాదు. అందుకే కార్యకర్తలు కూడా ప్రతి ఎన్నికల్లో తమ వైఖరిని మార్చుకుంటారన్న రాజకీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి. మరి భూతాన్ని రానివ్వనన్న ధైర్యం చంద్రబాబు లో రావడానికి కారణమేంటో మాత్రం తెలియదు.

## లడ్డులో కెమికల్ తో కూడిన ఆయిల్

### తేల్చి చెప్పిన దర్యాప్తు బృందం



తిరుమల, జూన్ 27, టీటీడీ లడ్డూ వివాదం ఒక కొలిక్కి వచ్చేలా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేపడుతున్న సంగతి తెలిసిందే. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డులో జంతు కొవ్వు కలిపారని సీఎం చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో ఇది పెను వివాదానికి దారి తీసింది. దీంతో సుప్రీంకోర్టు స్పందించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సంయుక్తంగా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. గత కొద్ది నెలలుగా ఈ బృందం తిరుమల కేంద్రంగా విచారణ చేపట్టింది. లడ్డు వివాదానికి సంబంధించి విచారణ ఒక కొలిక్కి తెచ్చే ప్రయత్నం జరిగింది. అయితే శ్రీవారి లడ్డు తయారీకే కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ దేవాలయాల్లో సైతం ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఈ ప్రత్యేక దర్యాప్తు బృందం కోర్టుకు నివేదించడం విశేషం. కొద్ది రోజులుగా సిబిఐ అధికారి నేతృత్వంలో ఈ విచారణ కొనసాగుతోంది. అయితే ఇటీవల విచారణ నివేదికను హైకోర్టుకు అందించింది ఈ బృందం. తిరుమల తో పాటు కాణిపాకం, శ్రీకాళహస్తి, శ్రీశైలం, విజయవాడ, కనకదుర్గ, ద్వారకాతిరుమల, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయాల్లో ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని తమ దర్యాప్తులో తేలినట్లు సిబిఐ అడ్వకేట్ హైకోర్టుకు నివేదించారు. అయితే ఇది కల్తీ నెయ్యి అనడం కంటే ఆవు నెయ్యి పేరుతో పామాయిల్ లో కెమికల్స్ కలిపి ఆవు నెయ్యిల కనబడేలా, సువాసన వచ్చేలా చేసి ప్రసాదాలకు సరఫరా చేశారని కోర్టుకు నివేదించారు. దీంతో జంతువు అనే పదం రాకుండా.. పామాయిల్ అని నివేదించడం ఈ కేసులో కీలక పరిణామంగా భావిస్తున్నారు. భక్తుల ఆందోళన తిరుమలలోతయారీకి వినియోగించే నెయ్యిలో జంతువు కలిసిందనే వార్త యావత్ ప్రపంచంలో ఉన్న శ్రీవారి భక్తులను కలచివేసింది. అయితే దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పందించింది. సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. రాజకీయ దురుద్దేశంతోనే కూటమి ప్రభుత్వం తిరుమలలో జంతువు కలిపారని ఆరోపిస్తున్నారని.. నిష్పక్షపాత విచారణ జరగాలని టీటీడీ పూర్వపు అధ్యక్షుడు వైవి సుబ్బారెడ్డి పిటిషన్ వేశారు. దీనిపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం దర్యాప్తు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక బృందాన్ని నియమించింది. దీనికి సిబిఐ అధికారి నేతృత్వం వహిస్తున్నారు. అయితే ఇప్పటికే దీనికి సంబంధించి చాలా మంది అరెస్టులు కూడా జరిగాయి. అయితే ఇప్పుడు కేసు తుది దశకు చేరుకుంటోంది. నెయ్యిలో కల్తీ అయితే జరిగిందని అది పామాయిల్ తో కూడిన కెమికల్ అని ప్రాథమికంగా నిర్ధారణ అయింది. కానీ అసలు విషయం పై క్లారిటీ రానుంది కొద్దిరోజుల్లో.. అంతవరకు వెయిట్ చేయక తప్పదు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

అనకాపల్లి,అనకాపల్లి జిల్లా కశింకోట(మం)ఉగ్గిన పాలెం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఆగి ఉన్న లారీని అదుపుతప్పిన కూరగాయల వ్యాన్ డీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్,మహిళ మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గాయపడిన వారిని అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కసింకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో

### కొత్త ప్లాన్ లతో జగన్ వ్యూహాలు

విజయవాడ, జూన్ 27,వైసీపీ అధినేత వైఎస్ జగన్ మానసికంగా సిద్ధమయినట్లు కనిపిస్తుంది. తనను జైలుకు పంపడానికి కూటమి ప్రభుత్వం రెడీ అవుతుందని భావిస్తున్నారు. అందుకోసమే ఐదు వారాల పాటు ఉద్యమ కార్యాచరణను ప్లాన్ చేశారు. నేతలను నియోజకవర్గాలలో యాక్టివ్ చేయడానికి సిద్ధం చేస్తున్నారు. ఇకపై తన పర్యటనలపై కూడా ఆంక్షలు ఖచ్చితంగా ఉంటాయని భావించిన జగన్ నియోజకవర్గాల్లోనే జనం వద్దకు నేతలను పంపి వారిని నాలుగేళ్ల ముందే ఎన్నికలకు సిద్ధం చేయాలని రెడీ అవుతున్నారు. అయితే నాలుగేళ్ల ముందు నుంచి నేతలు ఏ మేరకు గ్రౌండ్ లెవెల్ లోకి కాలు మోపుతారన్నది మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. జగన్ వస్తే తప్ప నేతలు కదలని పరిస్థితులున్నాయి.ఒకవైపు మద్యం కేసు, మరొక వైపు సింగయ్య మృతి కేసు ఇలా వరస కేసులు జగన్ ను చుట్టుముట్టేలా కనపడుతున్నాయి. మద్యం కేసులో ఇప్పటికే తొమ్మిది మందిని అరెస్ట్ చేసిన స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం మోహిత్ రెడ్డిని విచారించనుంది. ఆ తర్వాత మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యే అవకాశాలున్నాయి. చివారఖరుగా జగన్ వైపు సిట్ చూసే అవకాశముందన్న ప్రచారం జోరుగా సాగుతుంది. మరొక వైపు ఇదే కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా ఈ కేసును సీరియస్ గా తీసుకుని మద్యం కుంభకోణం ద్వారా అందిన నిధులను మనీలాండరింగ్ చేసినట్లు కూడా ఈడీ తన కోణంలో దర్యాప్తు చేస్తుంది. మద్యం కుంభకోణంలో వచ్చిన నగదును కొంత భాగం మొన్నటి ఎన్నికలకు వినియోగించారని సిట్ దర్యాప్తులో వెల్లడయింది. నేతలను అరెస్ట్ చేసినంత మాత్రాన పార్టీ బలహీనం కాదు. అదే పార్టీ అధినేత ను కేసుల్లో ఇరికిస్తే నేతల నుంచి క్యాడర్ వరకూ భయపడే అవకాశముందని భావించి త్వరలోనే జగన్ అరెస్ట్ జరగవచ్చున్న ప్రచారం ఏపీ వ్యాప్తంగా చర్చజరుగుతుంది. దీంతో పాటు జగన్ కూడా అరెస్ట్ కావడానికి మానసికంగా సిద్ధంగానే ఉన్నారు. అందుకే ప్రతి సమావేశంలో అక్రమ కేసులు పెట్టి జైల్లో వేస్తే మూడు నాలుగు నెలల తర్వాత బెయిల్ పై బయటకు వస్తామని, భయపడేది లేదని చెబుతుండటం ఇందుకు అద్దం పడుతుంది. అందుకే జగన్ కూటమి పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంలో చంద్రబాబు సర్కార్ పై నేరుగా ప్రత్యక్ష యుద్ధానికి సిద్ధమయ్యారని కనపడుతుంది. దాదాపు నలభై రోజుల పాటు సాగే రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫేస్టో తర్వాత మరొక కార్యక్రమంతో జనం ముందుకు వెళ్లాలని జగన్ టీం ప్లాన్ చేసుకున్నట్లు కనపడుతుంది. అందుకోసం వరసగా ఇప్పటికే వివిధ వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ వారికి మద్దతుగా ఒకదాని వెంట మరొకటి కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు కనపడుతుంది. ఇప్పటికే జగన్ టీం దీనికిసంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిసింది. ఒకవేళ తాను జైలుకు వెళ్లినా నేతలు ఆ కార్యక్రమాలను అమలు చేసేలా ప్లాన్ చే?యాలని ముఖ్య నేతలకు జగన్ ఇప్పటికే సూచించినట్లు తెలిసింది. ఏడాది ముందు నుంచే పదకొండు సీట్లు వచ్చినా క్యాడర్ లో నీరసం ఆవరించకుండా వివిధ పర్యటనలు చేస్తున్న జగన్ పార్టీకి ఊపు తేవడమే కాకుండా ప్రాణం పోయడానికి మరి తాజా కార్యక్రమాలు ఏ మేరకు పనిచేస్తాయన్నది వేచి చూడాలి.

## కర్నూలులో రిలయన్స్ భారీ పరిశ్రమ

కర్నూలు, జూన్ 27, కర్నూలు వద్ద భారీ పరిశ్రమ ఏర్పాటుకు రిలయన్స్ సంస్థకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.1,622 కోట్లతో శీతలపానీయాల పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. పరిశ్రమ ఏర్పాటుతో 1200 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఎస్ఐపీబీ సమావేశంలో ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఓర్వకల్లు ఏపీఐఐసీ ల్యాండ్ లో పరిశ్రమ ఏర్పాటు చేస్తారు. ఎకరాకు రూ.30 లక్షల చొప్పున ప్లాంటుకు 80 ఎకరాలు కేటాయిస్తారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 ప్రకారం ప్రోత్సాహకాలు అందిస్తారు. 2026 డిసెంబర్ లోగా ఉత్పత్తి ప్రారంభించాలని రిలయన్స్ సంస్థకు గడువు విధించారు. తదుపరి చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ ఛైర్మన్, ఎండీకి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ప్రాజెక్ట్ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ యొక్క అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తారు. ఈ యూనిట్లో ప్యాకేజ్డ్ కార్బోనేటెడ్ శీతల పానీయాలు (సాఫ్ట్ డ్రింక్స్) , ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ వంటివి తయారు చేస్తారు. ఈ యూనిట్లో బాట్లింగ్ లైన్, వేర్హౌసింగ్, వాటర్ ట్రీట్మెంట్ సౌకర్యం, అడ్మినిస్ట్రేటివ్ భవనాలు ఉంటాయి.రిలయన్స్ 2022లో రూ. 22 కోట్లకు కాంపా కోలా బ్రాండ్ను స్వాధీనం చేసుకుంది. ఈ బ్రాండ్ 1970, 1980లలో భారతదేశంలో ప్రముఖ శీతల పానీయ బ్రాండ్గా ఉండేది. దీనిని "న్యూ ఇండియా" కోసం సమకాలీన రూపంలో తిరిగి ప్రవేశపెట్టాలని రిలయన్స్ నిర్ణయించు కుదం?. కర్నూలు ప్లాంట్ రిలయన్స్ ఫాస్ట్-మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ విభాగంలో భాగంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇది దేశీయ బ్రాండ్లను ప్రోత్సహించడం, భారతీయ వినియోగదారులకు సరసమైన ధరలలో అధిక నాణ్యత ఉత్పత్తులను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ యొక్క అనుబంధ సంస్థ అయిన రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శీతల పానీయాల (సాఫ్ట్ డ్రింక్స్) , ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ఉత్పత్తులను తయారు చేస్తుంది. కాంపా కోలా కాంపా లెమన్ , కాంపా ఆరెంజ్ , పవర్ అప్ , సుర్ వాటర్ వంటి ఉత్పత్తులు ఉన్నాయి. ఈ బ్రాండ్ నినాదంతో స్థానిక వినియోగదారులను ఆకర్షించేలా సిద్ధం చేశారు. ఈ ఉత్పత్తులు కోకా-కోలా, పెప్సీ వంటి అంతర్జాతీయ బ్రాండ్లతో పోటీపడేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ ప్లాంట్ కర్నూలు జిల్లాలో పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహిస్తుంది మరియు స్థానిక వ్యాపారులకు, సరఫరాదారులకు అవకాశాలను కల్పిస్తుంది. రిలయన్స్ ఆంధ్రప్రదేశ్లో ఇతర పెట్టుబడులను కూడా ప్రకటించింది, ఇందులో రూ. 65,000 కోట్లతో 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ యూనిట్ల ఏర్పాటు ఉంది, దీనిలో మొదటి ప్లాంట్ ప్రకాశం జిల్లాలోని కనిగిరిలో ప్రారంభించారు.

## అఖండ గోదావరి ప్రాజెక్ట్ అంటే ఏంటీ

రాజమండ్రి, జూన్ 27,2027 గోదావరి పుష్కరాల నాటికి రాజమండ్రిని డెవలప్ చేసేందుకు దాదాపు 95 కోట్లతో టూరిజం శాఖ అభివృద్ధి పనులు చేపట్టింది. దీనికి కేంద్ర సహాయం కూడా లభిస్తోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా రాజమండ్రిలో దీనికి శంకుస్థాపన చేశారు. ఇంతకూ అఖండ గోదారి ప్రాజెక్టు అంటే ఏమిటి? రాజమండ్రిలో ఏ ఏ ప్రాంతాల అభివృద్ధి చేస్తారు..రాజమండ్రిలోని గోదావరి తీరానికి పుష్కర్ ఘాట్ అనేది ఒక ఐకాన్ గా మారిపోయింది. ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమమైనా పుష్కర్ ఘాట్ లోనే జరుగుతోంది. అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా రాజమండ్రి పుష్కర్ ఘాట్ శాశ్వత ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చనున్నారు.చారిత్రక నగరంగా పేరొందిన రాజమహేంద్రవరంలో 127 ఏళ్ల చరిత్ర గలిగి వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన ప్రతిష్టాత్మక హేవలాక్ వంతెన పునర్నిర్మించనున్నారు.దీన్ని ఒక మల్టీ ఫంక్షనల్ టూరిస్ట్ హబ్గా తీర్చిదిద్దాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ క్రమంలో చారిత్రక, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలకు వేదికగా దీన్ని మార్చేస్తారు. 2.7 కి.మీల పొడవైన వంతెనపై ఒక్కొక్కటి 48 మీటర్ల విస్తీర్ణంలో 57 స్పాన్లు ఉన్నాయి.. వీటిలో 18 స్పాన్లను అభివృద్ధి చేస్తారు.

హేవలాక్ వంతెన ప్రాంతంలో జలపాతాలు, గ్లాస్ వంతెనలు, గేమింగ్ జోన్, స్పేస్ థీమ్, అర్బన్ హాట్ క్రాఫ్ట్ బజార్, హ్యాంగింగ్ గార్డెన్స్, హాలోగ్రామ్ జూ, టైమ్ ట్రావెల్, రైల్ మ్యూజియం, ఆక్వేరియం టన్నెల్ లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయనున్నారు.100 మీటర్ల విస్తీర్ణంలో ఆకర్షణీయమైన జలపాతాలు, వాటర్ స్ప్రేలు, నీటి మీద తేలుతూ ప్రయాణించేలా వినూత్నమైన క్యాస్కేడింగ్ ఫౌంటెన్ డిజైన్లు, లైట్ అండ్ సౌండ్ షోలు ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకులకు మధురమైన అనుభూతిని కల్పించనున్నారు. విదేశాల తరహా గాజు వంతెన:100 మీటర్ల గాజు వంతెన ఏర్పాటు చేసి పర్యాటకులకు పగిలిన గాజుపై నడిచే అనుభూతిని అందించనున్నట్టు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పర్యాటకుల భద్రతతో పాటు వారు మంచి అనుభూతికి లోనయ్యేలా గాజు వంతెనను తీర్చిదిద్దనున్నారు

ట్రెజర్ హంట్స్, వీడియో గేమ్ లు, ఇంటరాక్టివ్ ఫన్ వంటి కార్యక్రమాలతో అన్ని వయస్సుల వారు ఆనందంగా గడిపేలా 100-మీటర్లలో గేమింగ్ జోన్ ఏర్పాటు చేయనున్నారు. కుటుంబం, స్నేహితులతో సరదాగా గడిపులా, కొత్త నైపుణ్యాలు నేర్చుకునేలా దీన్ని తీర్చిదిద్దనున్నట్టు దుర్గేష్ అన్నారు.

భారతదేశ అంతరిక్ష విజయాల నుంచి ప్రేరణ పొందిన అంతరిక్ష పరిశోధన నేపథ్య ప్రాంతంగా ప్లానిటోరియం స్పేస్ థీమ్ ఉండనుంది. తద్వారా సందర్శకులు సున్నా గురుత్వాకర్షణను అనుభూతి పొందడం, నక్షత్రరాశులను అన్వేషించడం, విశ్వం గురించి తెలుసుకోవడం వంటి అంశాలు నేర్చుకునేందుకు వీలు కలుగుతుంది. అంతేగాక అంతరిక్ష ఔత్సాహికులకు ఇది విద్యాపరమైన జ్ఞానాన్ని అందించేందుకు అవకాశం ఉంది .

అర్బన్ హ్యాట్ క్రాఫ్ట్ బజార్ : ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పేలా రంగు రంగులతో కూడిన సుమారు 100 స్టాల్స్ తో క్రాఫ్ట్ బజార్ ఏర్పాటు చేయనున్నాం. తద్వారా పర్యాటకులకు స్థానిక కళలు, హస్తకళలు, సాంప్రదాయ వంటకాలు, సంగీతంతోపాటు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేలా మరుపురాని వినోదం అందించనున్నారు

హ్యాంగింగ్ గార్డెన్స్: వివిధ రకాల వృక్ష జాతులను ప్రదర్శించే కడియం నర్సరీల నుంచి ప్రేరణ పొంది హ్యాంగింగ్ గార్డెన్స్ ను ఏర్పాటు చేయనున్నట్టు పర్యాటక మంత్రి దుర్గేష్ అన్నారు. తద్వారా సందర్శకులు బొటానికల్ నైపుణ్యాలను అన్వేషించడంతోపాటు ఉద్యానవనాల పెంపకం గురించి తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుంది. అంతేగాక ప్రకృతితో పర్యాటకులు మమేకం అవుతారు.

హోలోగ్రామ్ సాంకేతికతను ఉపయోగించి వన్యప్రాణులను ప్రదర్శించే విధంగా హోలోగ్రామ్ జూను ఏర్పాటు చేయనున్నారు. దీని వల్ల వందల జంతుజాతులను వర్చువల్ విధానంలో చూసేలా, సంభాషించేలా అనుభూతిని అందిస్తుంది. జీవుల పరిణామ క్రమం, జంతువులు సజీవంగా ఉన్నట్లు ప్రతిబింబించేలా జూ ఏర్పాటు కానుంది.

టైమ్ ట్రావెల్:సమయ ప్రయాణాన్ని అన్వేషించేలా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఎఐ-ఆధారిత థీమ్ ను సందర్శకులకు అందుబాటులోకి రానుంది. తద్వారా పర్యాటకులు భవిష్యత్ కాలాన్ని సందర్శించేలా, విభిన్న కాలాల్లో ప్రయాణం చేస్తున్నట్లు అనుభూతి కలిగించేలా ఏర్పాట్లు చేయనున్నారు.

రైల్ మ్యూజియం:

సందర్శకులకు భారతీయ రైల్వే చరిత్రను తెలిపేలా రైల్ మ్యూజియం అందుబాటులోకి తీసుకురానున్నారు. తద్వారా రైల్వే ప్రాముఖ్యత, రైల్ ప్రయాణం, సాంకేతిక పురోగతితో రైల్వేలో వచ్చిన పురోగతి, సాంస్కృతిక చరిత్రను తెలుసుకోవచ్చును.

అక్వేరియం టన్నెల్:

అక్వేరియం టన్నెల్ ఏర్పాటు ద్వారా సందర్శకులు పారదర్శకంగా ఉండే టన్నెల్ గుండా ప్రయాణించి లైటింగ్, సౌండ్ తో కూడిన నిర్మలమైన వాతావరణంలో సముద్ర జీవనాన్ని అనుభూతి చెందేందుకు చర్యలు తీసుకోనున్నారు థీమాటిక్ జోన్లకు ఆనుకుని సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను అందించేలా 10 బఫర్ స్పేస్లు ఏర్పాటు చేస్తున్నారు. అందులో ప్రధానంగా ప్రతి బఫర్ జోన్ లో 10 స్టాల్స్ తో ఉండేలా 5 ప్రత్యేకమైన ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తారు.

## సైకిల్ యాత్రికుడి భారతదేశ యాత్ర గుంటూరులో ప్రవేశం....

### కడప నుంచి కాశ్మీర్ దాకా సైకిల్ యాత్ర దిగ్విజయంగా జరగాలి...

అమరావతి:పచ్చని భూమిని కాపాడుకుంటూ చెట్లని చిన్ననాటి నుంచే నాటుతూ వాతావరణం లో కాలుష్యాన్ని నిర్మూలించాలని కడప జిల్లాకు చెందిన కోటా కార్తీక్ అనే డిగ్రీ చదివే విద్యార్థి మరియు సైకిల్ పై భారతదేశ యాత్రలో భాగంగా గుంటూరు వచ్చారు. సేవ్ ఎర్త్ సేవ్ ట్రీస్ భూమిని కాపాడుకుందాం - చెట్లని నాటుదాం అనే కార్యక్రమం స్ఫూర్తితో దారిలో చెట్లు నాటుతూ కాలుష్య రహిత భారతదేశం నిర్మాణం జరగాలని ఆయన కాంక్షిస్తూ దేశ పర్యటనలో భాగంగా గుంటూరు వచ్చిన సందర్భంలో తెదేపా నేత, బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ ని కలిశారు. బ్రాహ్మణ చైతన్య వేదిక, చాణిక్య ఫ్రెండ్ సర్కిల్ వారు సైకిల్ యాత్రకు సంఘీభావం తెలియజేశారు. అతనికి భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసి ఆయన్ను గుంటూరు నుంచి సిరిపురపు శ్రీధర్ జెండా ఊపి అతని యాత్రను తిరిగి ప్రారంభం చేశారు. సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ నేటి యువతకు కార్తీక్ స్ఫూర్తిగా నిలవాలని చిన్న వయసులోనే భూమిని కాపాడటం చెట్లను నాటాలి కాలుష్యాన్ని తగ్గించాలి అనే ఉద్దేశం యువకుల్లా రావడం అభినందన్న దగ్గ విషయమని, నేటి యువకులు చదువులు సాఫ్ట్వేర్ ఉద్యోగాలతో పాటు భూమ్మీద సామాజిక సమతుల్యత ఎలా చేయాలి అనేది కూడా గ్రహించాలని , ఈ యువకునికి సోషల్ మీడియాలో దాదాపు రెండు లక్షల మంది ఫాలోయర్స్ ఉన్నారని, ఈ యువకుడు కడప నుంచి కాశ్మీర్ వరకు జరిపే ప్రయాణం దిగ్విజయంగా జరగాలని ప్రతి గ్రామం పట్టణం నగరాల్లో ఈ యువకుడికి సంఘీభావం తెలియజేయాలని శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిలుమూరు ఫణి, ఎండపల్లి శబరి, ఫణి, నాగరాజు, వడ్లమూడి రాజా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# ఇంగ్లండ్ గడ్డపై గెలవాలంటే.. టీమిండియా అతన్ని ఆడించాలి: మైకేల్ క్లార్క్

ఇంగ్లండ్ గడ్డపై టీమిండియా విజయం సాధించాలంటే తుది జట్టులోకి లెఫ్టార్మ్ రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను తీసుకోవాలని ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైకేల్ క్లార్క్ అన్నాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించే సత్తా కుల్దీప్ యాదవ్‌కు ఉందని తెలిపాడు. తొలి టెస్ట్‌లో అతన్ని ఆడించకపోవడం టీమిండియా మేనేజ్‌మెంట్ బుద్ధి తక్కువ నిర్ణయమని విమర్శించాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్–సచిన్ ట్రోఫీలో భాగంగా లీడ్స్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది.ఐదు రోజుల పాటు రసవత్తరంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఐదు శతకాలు సాధించినా భారత్ విజయాన్నందుకోలేకపోయింది.



ఈ మ్యాచ్‌లో టీమిండియా ఏకైక స్పిన్నర్ రవీంద్ర జడేజాతో ఆడింది. అతను తీవ్రంగా నిరాశపర్చాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఒకే ఒక్క వికెట్ తీసాడు. ఈ మ్యాచ్ నేపథ్యంలో మాట్లాడిన మైకేల్ క్లార్క్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.'భారత బౌలింగ్ విభాగంలో నేను ఎవర్నీ నిందించాలనుకోవడం లేదు. కానీ వారు కుల్దీప్ యాదవ్‌ను ఆడించాల్సింది. అతన్ని ఆడించకపోవడం బుద్ధి తక్కువ నిర్ణయం. ఎలాంటి పరిస్థితుల్లోనైనా వికెట్ తీసే సత్తా అతనికి ఉంది. తొలి టెస్ట్‌లో అతను మరింత ప్రభావం చూపేవాడు. బౌలింగ్ లైనప్ కంటే బ్యాటింగ్ డెప్త్‌కు టీమిండియా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. చాలా కాలంగా ఇలా చేస్తుంది. ఎక్స్‌ట్రా బ్యాటర్ ఉండటంతో పాటు బ్యాటింగ్ డెప్త్ ఉండేలా జాగ్రత్తపడుతుంది. ఈ క్రమంలో వారు తమ నెంబర్ వన్ స్పిన్నర్‌ను కూడా పక్కనపెట్టేస్తున్నారు.ఇంగ్లండ్ గడ్డపై విజయం సాధించాలంటే 20 వికెట్లు తీయాలి. బుమ్రా స్టార్ పేసర్. అతను బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహిస్తున్నాడు.కానీ ఇతర పేసర్ల నుంచి సహకారం లభించడంలేదు. కొన్నిసార్లు ౼ తీయడం ఎలాగో నేర్చుకోవాల్సి ఉంది. వారి ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాలి. జడేజా పెద్దగా ప్రభావం చూపలేదు. రెండో ఇన్నింగ్స్‌లో అతను లెఫ్టార్మ్ బ్యాటర్లను ఇబ్బంది పెడుతాడని భావించాను. కానీ అతను విఫలమయ్యాడు. అతను మరీ స్ట్రైట్‌గా బౌలింగ్ చేసినట్లు అనిపించింది.'అని మైకేల్ క్లార్క్ చెప్పుకొచ్చాడు.

# అందుకే క్యాచ్‌లు వదిలేసారు: టీమిండియా మాజీ ఫీల్డింగ్ కోచ్




ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌లో టీమిండియా ఫీల్డింగ్ వైఫల్యంపై మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్ శ్రీధర్ స్పందించాడు. చల్లటి వాతావరణంలో క్యాచ్‌లు పట్టడం కష్టమేనని అభిప్రాయపడ్డాడు. నాలుగు క్యాచ్‌లు వదిలేసిన యశస్వి జైస్వాల్‌కు ఆర్ శ్రీధర్ అండగా నిలిచాడు.లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో భారత ఆటగాళ్లు దాదాపు 10 క్యాచ్‌లు నేలపాలు చేశారు. దాంతో గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ క్రమంలోనే భారత ఫీల్డింగ్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే భారత ఆటగాళ్లను ఆర్ శ్రీధర్ వెనకేసుకొచ్చాడు.'ఇంగ్లండ్‌లో తొలి పర్యటనకు వెళ్లి స్లిప్‌లో ఫీల్డింగ్ చేయడం అంత సులువైన పని కాదు. ఎంతో ప్రాక్టీస్ చేసినప్పటికీ.. మ్యాచ్ విషయానికి వచ్చేసరికి క్యాచ్‌లు అందుకోవడం సవాలుతో కూడుకున్నది. అక్కడ వాతావరణం చాలా చల్లగా ఉంటుంది. దాంతో చేతివేళ్లు మొద్దుబారి పోయి ఉంటాయి. అలాగే డ్యూక్ బంతిని పట్టుకోవడం అంత తేలికైన విషయం కాదు. ఇంగ్లండ్‌లో బంతిని చూడటం చాలా కష్టం. ఓవల్, లీడ్స్‌లో మైదానాలు చాలా కఠినమైనవి.లీడ్స్ పెవిలియన్ వైపు మైదానం వాలుగా ఉంటుంది. గాలులు కూడా వేగంగా వీస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఫీల్డింగ్ చేయడం చాలా కష్టం. ఇంగ్లండ్ ఆటగాళ్లు కూడా క్యాచ్‌లు వదిలేశారు. ఇక్కడ సమస్య సామర్థ్యం గురించి కాదు. పరిస్థితుల గురించి మాత్రమే. వాస్తవానికి యశస్వి జైస్వాల్ అద్భుతమైన ఫీల్డర్. ఆస్ట్రేలియా పర్యటనలోనూ క్యాచ్ పట్టే విషయంలో యశస్వి ఇబ్బంది పట్టాడు. అయితే భారత్ వేదికగా జరిగిన మ్యాచ్‌ల్లో అద్భుతమైన క్యాచ్‌లు అందుకున్నాడు. కామెంట్రీ బాక్స్‌లో కూర్చొని విమర్శించడం తేలికే. కానీ ఇంగ్లీష్ కండిషన్స్‌లో అతను తొలిసారి ఆడుతున్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. 'అని శ్రీధర్ వివరించాడు.

# చెత్త అంపైరింగ్.. మ్యాచ్‌ను బాయ్‌కట్ చేయండి!

వెస్టిండీస్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో అంపైర్ల నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. అంపైర్లు తప్పుడు నిర్ణయాలతో తొండాట ఆడుతున్నారని, మ్యాచ్‌ను బాయ్‌కట్ చేయాలని వెస్టిండీస్ ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిడ్జ్‌టౌన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్‌కు వ్యతిరేకంగా అంపైర్లు నాలుగు తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా థర్డ్ అంపైర్ అడ్రియన్ హోల్‌స్టాక్ నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి.రెండు రోజుల ఆటలోనే అతను ఐదు తప్పుడు నిర్ణయాలు తీసుకున్నాడని ఫ్యాన్స్ ఆరోపిస్తున్నారు. ఇందులో ఒకటి ఆస్ట్రేలియాకు నష్టం చేయగా.. మిగిలిన నాలుగు తప్పిదాలు వెస్టిండీస్ కొంపముంచాయి. థర్డ్ అంపైర్ కారణంగానే వెస్టిండీస్ మూడు కీలక వికెట్లు కోల్పోయిందని ఫ్యాన్స్ మండిపడుతున్నారు.తొలి రోజు ఆటలో ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ స్లిప్ ఫీల్డర్‌కు క్యాచ్ ఇచ్చాడు. అయితే థర్డ్ అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. బంతిని అందుకునే క్రమంలో పిచ్ అయిందని తెలిపాడు. ఆ తర్వాత కామెరూన్ గ్రీన్ ఎల్బీడబ్ల్యూ విషయంలోనూ ఇలాంటి నిర్ణయాన్నే ప్రకటించాడు. ఆ తర్వాత వెస్టిండీస్ బ్యాట్ సందర్భంగా రోస్టన్ ఛేజ్ ఎల్బీ విషయంలోనూ ఇలాంటి తప్పుడు నిర్ణయాన్నే ప్రకటించాడు. బంతి బ్యాట్‌కు తాకకున్నా తాకిందని నాటౌటిచ్చాడు.రెండో ఇన్నింగ్స్‌లో రోస్టన్ ఛేజ్ ఎల్బీ విషయంలోనూ తప్పుడు నిర్ణయాన్ని ప్రకటించాడు. బంతి బ్యాట్ ఎడ్జ్ అయిందని రోస్టన్ ఛేజ్ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ మైదానం వీడాడు. షై హోప్ క్యాచ్ విషయంలోనూ థర్డ్ అంపైర్ వివాదాస్పద నిర్ణయాన్ని ప్రకటించాడు. బంతిని అందుకునే క్రమంలో నేలకు తాకినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నా.. తాకలేదని ఔటివ్వడం తీవ్ర వివాదాస్పదమైంది. ఈ నిర్ణయంపై వెస్టిండీస్ హెడ్ కోచ్ డారెన్ సామీతో పాటు ఇతర ఆటగాళ్లు, అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. సామీ అయితే తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. అడ్రియన్ ఉద్దేశపూర్వకంగా ఇలా చేస్తున్నాడా? లేక అంపైరింగ్ ఎలా చేయాలో తెలియదా? అని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు చేసింది. అనంతరం వెస్టిండీస్ 190 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా..రెండో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లకు 92 పరుగులు చేసింది.




# వెస్టిండీస్ క్రికెటర్‌పై లైంగిక దాడి ఆరోపణలు.. బాధితుల్లో 11 మంది మహిళలు !




గయానా: వెస్టిండీస్‌కు చెందిన ఓ క్రికెటర్‌పై లైంగిక దాడి ఆరోపణలు వచ్చాయి. ఓ యువతిని అతను లైంగికంగా వేధించినట్లు గయానాలో ఫిర్యాదు నమోదు అయ్యింది. అయితే ఆ క్రికెటర్ మరో 11 మంది మహిళలను కూడా లైంగికంగా వేధించినట్లు తెలుస్తోంది. ఆ క్రికెటర్ ఎవరన్నది వెల్లడించలేదు. అతను గయానాకు చెందినట్లు అంచనా వేస్తున్నారు. మైదానంలో ఓ రాక్షసుడు తిరుగుతున్నాడని గయానాకు చెందిన వార్తా సంస్థ ఓ కథనాన్ని రాసింది. ప్రస్తుతం అతను వెస్టిండీస్ జాతీయ జట్టులో ఆడుతున్నట్లు కూడా వెల్లడించారు. లైంగిక వేధింపులు, దాడులు, అత్యాచారం జరిగినట్లు ఆరోపణలు ఉన్నా.. ఆ క్రికెటర్‌పై మాత్రం ఇప్పటి వరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు.వెస్టిండీస్ క్రికెట్ బోర్డు కూడా దీనిపై అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఆ ప్లేయర్ వివరాలు బయటకు రాకుండా ఉండేందుకు క్రికెట్ బోర్డు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం విండీస్ జట్టులో అతనో కీలక ప్లేయర్ అని తెలిసింది. ఈ విషయం తమకు పూర్తిగా తెలియదని, కామెంట్ చేసే స్థితిలో లేమని విండీస్ బోర్డు ప్రెసిడెంట్ కిషోర్ షాలో తెలిపారు. 2024 జనవరిలో బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో ఆ క్రికెటర్ ఆడినట్లు ఓ లాయర్ తెలిపారు. ఆస్ట్రేలియాపై విజయం సాధించి స్వదేశానికి తిరిగి వచ్చిన సమయంలో అతనికి హీరో వెల్కమ్ ఇచ్చినట్లు కూడా చెప్పారు.

# డోప్ పరీక్షలో విఫలం.. నిషేధానికి గురైన నేషనల్ ఛాంపియన్..!




భారత అథ్లెట్లు వరుసగా డోప్ పరీక్షలో దొరికిపోతున్నారు. ఈమధ్యే క్వార్టర్ మిలర్(400 మీటర్ల రన్నర్) స్నేహ కొల్లేరి నిషేధానికి గురవగా.. తాజాగా జాతీయ స్థాయిలో పలు పతకాలు గెలుపొందిన రన్నర్ ట్వింకిల్ చౌదరీ సైతం డోప్ టెస్టులో పట్టుబడింది. అంతర్జాతీయ టోర్నీల్లో సత్తా చాటుతున్న ఆమె అనూహ్యంగా నిషేధిత డ్రగ్ తీసుకొని బుక్ అయిందది. దాంతో, అథ్లెటిక్స్ ఇంటెగ్రిటీ యూనిట్ ఆమెపై నిషేధం విధించింది.నిరుడు ఉత్తరాఖండ్‌లో జరిగిన 4400 మీటర్ల రీలే పోటీల్లో స్వర్ణం సాధించిన బృందంలో ట్వింకిల్ సభ్యురాలు. అదే ఈవెంట్లో 4400 మీటర్ల మిక్స్‌డ్ రీలేలో కాంస్యం గెలుపొందిందీ అథ్లెట్. కెరియర్‌లో ఒక్కోమెట్టు ఎక్కుతున్న సమయంలోనే ట్వింకిల్ డోప్ పరీక్షలో విఫలమైంది. ఆమె రక్త నమూనాల్లో నిషేధిత మిథైల్‌టెస్టోస్టిరాన్ డ్రగ్ ఉంది. ఇది ఒక అనబాలిక్ స్టిరాయిడ్. డోప్ టెస్టు ఫలితాలు రాగానే ఆమెకు ఏఐయూ నోటీసులు పంపింది. తర్వాతి దశలో ట్వింకిల్ స్వయంగా ఏఐయూ అధికారుల ముందు హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.జలంధర్‌కు చెందిన ట్వింకిల్ చిన్నప్పట్నుంచి ఆటల్లో ముందుండేది. చిరుతలా పరుగెత్తే ఆమె అథ్లెటిక్స్ వైపు మొగ్గు చూపింది. ఈమధ్యే కొచ్చిలో జరిగిన 28వ జాతీయ సమాఖ్య సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ పోటీల్లో ట్వింకిల్ సత్తా చాటింది. 800 మీటర్ల పరుగులో 2:00:71 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకొని రికార్డున నెలకొల్పింది. జూన్‌లో తైవాల్ ఓపెన్‌లోనూ తనకు తిరుగులేదని చాటుతూ వెండి పతకంతో మెరిసింది 28 ఏళ్ల ట్వింకిల్. దక్షిణ కొరియాలో మే నెలలో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానంలో నిలిచింది .

# ప్లేయర్స్ రూమ్‌కు గర్ల్‌ఫ్రెండ్‌ను తీసుకువచ్చిన శిఖర్ ధావన్

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ఓ స్టన్నింగ్ విషయాన్ని వెల్లడించాడు. ఇండియా ఏ జట్టుతో 2006లో ఆస్ట్రేలియాలో టూర్ చేస్తున్న సమయంలో.. ప్లేయర్స్ రూమ్‌కు గర్ల్‌ఫ్రెండ్‌ను తీసుకువచ్చినట్లు చెప్పాడు. తన ఆటోబయోగ్రఫీలో ఈ విషయాన్ని తెలిపాడు. తాజాగా ఆ బుక్ రిలీజైన విషయం తెలిసిందే. ఫీల్డ్‌లో ఎప్పుడూ సరదాగా ఉండే ఆ క్రికెటర్.. ఎలా తన రూమ్‌కు ఇష్టపడిన అమ్మాయిని తీసుకువచ్చాడో వెల్లడించాడు. రోహిత్ శర్మతో రూమ్ షేర్ చేసుకున్న సమయంలో ఈ ఘటన జరిగింది.ఆస్ట్రేలియా టూర్ సమయంలో ఓ అమ్మాయితో ధావన్ ప్రేమాయణం సాగించాడు. అయితే క్రీజ్‌లో లేనప్పుడు రూమ్‌కు ఆ అమ్మాయిని తీసుకువచ్చేవాడు. ఆ టైంలో రోహిత్ శర్మ కొంత ఇబ్బందికి గురయ్యేవాడట. నిద్ర పోనివ్వవా అంటూ రోహిత్ ఆగ్రహానికి గురయ్యేవాడని శిఖర్ తన బుక్‌లో రాశాడు. డేటింగ్ రిలేషన్ గురించి టీమ్‌లో అందరికీ తెలిసిపోయిందని, దాంట్లో జట్టు సభ్యులు ఆమెను చూసేందుకు వచ్చేవారన్నాడు. చాలా అందంగా ఉంటుందని, సడెన్‌గా లవ్‌లో పడిపోయానని, తాను నా కోసమే పుట్టిందన్న భావన వచ్చిందని, పెళ్లి చేసుకోవాలన్న ఆలోచనలో ఉన్నట్లు కూడా ధావన్ తెలిపాడు.ప్రతి రోజు మ్యాచ్ ముగిసిన తర్వాత ఆ అమ్మాయి వద్దకు వెళ్లి కలిసేవాడినని, ఓ రోజు డిన్నర్‌కు వెళ్తున్న సమయంలో ఆమె రూమ్‌కు వచ్చిన విషయాన్ని తెలుసుకున్న జట్టు సభ్యులు తన వెంటపడినట్లు ధావన్ తెలిపాడు. చేతుల్లో చేయి వేసి నడుస్తున్న సమయంలో.. సీనియర్ సెలెక్టర్ కూడా ఇద్దర్నీ చూసేసినట్లు గుర్తు చేశాడు.ఇండియా తరపున ధావన్ 34 టెస్టులు, 167 వన్డేలు, 68 టీ20లు ఆడాడు. వన్డేల్లో ధావన్ 44 సగటుతో 6793 రన్స్ చేశాడు. దాంట్లో 17 సెంచరీలు, 39 ఫిఫ్టీలు ఉన్నాయి. టెస్టుల్లో అతను 2315 రన్స్ చేశాడు. ఏడు సెంచరీలు, 5 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.



# చర్మం మిళమిళ మెరిపించడానికి, కళ్ళక్రింద, మెడ నలుపు పోగొట్టడానికి బియ్యం కడిగిన నీళ్ళు ఇలా వాడండి





బియ్యం నీరు ఒక పురాతన మరియు అత్యంత ప్రయోజనకరమైన పదార్థం, దీనిని వివిధ సౌందర్య చికిత్సలకు ఉపయోగిస్తారు. ముఖ్యంగా, ఆసియా దేశాలలో, చర్మానికి బియ్యం నీటిని ఉపయోగించడం చాలా ప్రాచుర్యం పొందింది. బియ్యం నీటిని ఉపయోగించడం వల్ల చర్మాన్ని పునరుజ్జీవింపజేసి, కాంతివంతంగా మరియు దాని ఆకృతిని మెరుగుపరుస్తుంది. ఈ నీరు చర్మ రంధ్రాలను లోతుగా శుభ్రపరుస్తుంది మరియు చర్మ కణాలను పునరుజ్జీవింపజేస్తుంది. బియ్యం నీటిలో అనేక పోషకాలు, ఖనిజాలు మరియు యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ఈ కారకాలన్నీ చర్మ ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. రైస్ వాటర్ ను రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల చర్మంపై మొటిమలు, నల్ల మచ్చలు మరియు ఇతర మచ్చలు తగ్గుతాయి. చర్మం కాంతివంతం మరియు తాజాదనం కోసం రైస్ వాటర్ సహజమైన, చౌకైన మరియు సమర్థవంతమైన నివారణ. నేటి రాశిఫలం 05 ఆగస్ట్: ఓ రాశికి గ్రహాల ప్రభావం వల్ల ఈ రోజు చాలా బాగుంది, మీరు ప్రతి రంగంలో విజయం సాధిస్తారు. బియ్యం కడిగిన నీళ్లు పారబోయడానికి ముందు ఆనీటిలో ఎలాంటి ప్రయోజనాలు దాగున్నాయో, ఎలా ఉపయోగించాలో తెలుసకోండి. చర్మం కాంతివంతం బియ్యం నీళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ బి కాంప్లెక్స్ చర్మాన్ని కాంతివంతంగా మార్చేందుకు తోడ్పడతాయి. ఈ పదార్థాలు చర్మంలోని మృతకణాలను తొలగిస్తాయి మరియు కొత్త కణాల పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. రైస్ వాటర్ ను రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల చర్మం మృదువుగా మరియు కాంతివంతంగా కనిపిస్తుంది. చర్మం తాజాగా కనబడుతుంది ఈ పుట్టిన తేదీకి చెందిన వ్యక్తులు విజయం పొందుతారు, వచ్చే వారం సరదాగా ఉంటుంది బియ్యం నీళ్లలోని చల్లదనం చర్మానికి తాజాదనాన్ని ఇస్తుంది. చర్మం నుండి దుమ్ము, ధూళి మరియు ఇతర మలినాలను తొలగిస్తుంది. ఇది చర్మంలోని అలసటను పోగొట్టి చర్మం తాజాగా కనిపిస్తుంది. పోషణ అందిస్తాయి బియ్యం నీళ్లలో ఉండే పోషకాలు చర్మానికి పోషణనిస్తాయి. ఇది చర్మ కణాలను బలోపేతం చేసి ఆరోగ్యవంతంగా చేస్తుంది. చర్మానికి సరైన పోషకాలు అందించడం వల్ల చర్మం కాంతివంతంగా మరియు కాంతివంతంగా మారుతుంది. చాక్లెట్ తినేవారికి షాకింగ్ విషయం! వాటిలో విషపూరిత లోహాలు, మూత్రపిండాలు, నాడీవ్యవస్థను దెబ్బతీస్తాయి మొటిమలు మాయమవుతాయి రైస్ వాటర్‌లోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమలను తగ్గిస్తాయి. ఇది స్కిన్ ఇన్ఫెక్షన్‌లను నివారించడంలో సహాయపడుతుంది మరియు చర్మాన్ని మొటిమలు రాకుండా చేస్తుంది. చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తుంది బియ్యం నీటిని చర్మానికి మాయిశ్చరైజర్‌గా ఉపయోగించవచ్చు. ఈ రెమెడీ చర్మానికి అవసరమైన తేమను అందించి, పొడిబారకుండా చేస్తుంది. ఇది చర్మాన్ని మృదువుగా మరియు మృదువుగా ఉంచుతుంది. బియ్యం నీటిని ఎలా రెడీ చేసుకోవాలి? ఒక కప్పు బియ్యం శుభ్రం చేసి. బియ్యం నుండి దుమ్ము మరియు ధూళిని తొలగించండి. ఒక గిన్నెలో బియ్యం తీసుకుని రెండు కప్పుల నీరు కలపండి. బియ్యం మరియు నీరు కలపండి మరియు 30 నిమిషాలు అలాగే ఉంచండి. 30 నిమిషాల తరువాత, బియ్యం నుండి నీటిని వడకట్టండి. ఈ నీటిని నేరుగా చర్మంపై ఉపయోగించాలి. లేదా బియ్యం ఉడకబెట్టి నీటిని(గంజి) సిద్ధం చేయండి. దీని కోసం, 1 కప్పు బియ్యానికి 2 కప్పుల నీరు వేసి ఉడికించాలి. బియ్యం ఉడికిన తర్వాత అదనపు నీటిని వడకట్టాలి. ఇది మీరు నేరుగా పత్తి సహాయంతో ముఖం మీద అప్లై చేసుకోవచ్చు. చర్మంపై బియ్యం నీటిని ఎలా ఉపయోగించాలి 1. టోనర్‌గా ఉపయోగించండి మీరు బియ్యం నీటిని స్కిన్ టోనర్‌గా ఉపయోగించవచ్చు. చల్లబరచడానికి ఒక కప్పు బియ్యం నీటిని ఫ్రిజ్‌లో ఉంచండి. ప్రతిరోజూ ఉదయం మరియు రాత్రి కాటన్ బాల్‌తో చర్మంపై అప్లై చేయండి. 2. ఫేస్ మాస్క్‌గా ఉపయోగించండి బియ్యం నీళ్లలో కొన్ని శెనగపిండి మరియు పసుపు కలపండి. ఈ పేస్ట్‌ని చర్మంపై అప్లై చేసి 15-20 నిమిషాలు అలాగే ఉంచాలి. తర్వాత చల్లటి నీటితో కడగాలి. 3. స్నానానికి ఉపయోగించండి స్నానపు నీటిలో బియ్యం నీటిని కలపండి. ఈ నీటిలో స్నానం చేయడం వల్ల చర్మం కాంతివంతంగా మరియు రిఫ్రెష్ అవుతుంది. 4. స్ప్రేగా ఉపయోగించండి స్ప్రే బాటిల్‌లో బియ్యం నీటిని నింపండి. అవసరమైన విధంగా చర్మంపై స్ప్రే చేయండి. ఇది చర్మాన్ని రిఫ్రెష్ చేస్తుంది మరియు తేమ చేస్తుంది. 5. డార్క్ సర్కిల్స్ మీద ఉపయోగించండి కాటన్ ప్యాడ్‌పై బియ్యం నీటిని తీసుకుని నల్లటి వలయాలపై ఉంచండి. 10-15 నిమిషాలు అలాగే ఉంచి, ఆపై చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి. రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల డార్క్ సర్కిల్స్ తగ్గుతాయి.

# జుట్టు రాలడాన్ని నివారించడానికి ఒక్క హెయిర్ మాస్క్ మరియు ఒక్క హెల్తీ జ్యూస్ చాలు



చాలా మంది జుట్టు రాలే సమస్యతో బాధపడుతున్నారు. జుట్టు రాలడాన్ని తగ్గించడానికి ప్రజలు వివిధ రకాల షాంపూలను ఉపయోగిస్తారు. అయితే కేవలం షాంపూ వాడితే సరిపోదు. మీ జుట్టును చక్కగా సంరక్షించుకోవడానికి మీరు కొన్ని ఇంటి నివారణల సహాయం తీసుకోవచ్చు. అయితే, బాహ్య సంరక్షణతో పాటు, అంతర్గత సంరక్షణ కూడా ముఖ్యం. దీని కోసం మీరు ఇంట్లో తయారుచేసిన హెయిర్ మాస్క్‌ని అప్లై చేయడంతో పాటు ఈ డ్రింక్ తీసుకోవచ్చు. జుట్టు రాలడాన్ని తగ్గించడానికి ఇంట్లోనే హెయిర్ మాస్క్‌లను ఎలా తయారు చేయాలో మరియు జుట్టు రాలడానికి ఉత్తమమైన డ్రింక్ ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకోండి. చర్మం మిళమిళ మెరిపించడానికి, కళ్ళక్రింద, మెడ నలుపు పోగొట్టడానికి బియ్యం కడిగిన నీళ్ళు ఇలా వాడండి జుట్టు రాలడాన్ని నివారించడానికి ఈ హెయిర్ మాస్క్‌ని అప్లై చేయండి ఈ హెయిర్ మాస్క్ చేయడానికి మీకు కావాల్సినవి: అరకప్పు మెంతి గింజలను రాత్రంతా నానబెట్టాలి 25-30 కరివేపాకు 1 మధ్య తరహా ఉల్లిపాయ ఎలా చేయాలి ఈ హెయిర్ మాస్క్ చేయడానికి, రాత్రిపూట నానబెట్టిన అరకప్పు మెంతి గింజలు మరియు 25-30 కరివేపాకులను తీసుకోండి. తర్వాత మెత్తగా పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు మీడియం సైజు ఉల్లిపాయను మెత్తగా కోయాలి.మెత్తగా గ్రైండ్ చేసి ఉల్లిపాయ రసం వడగట్టుకోవాలి. తర్వాత మెంతి గింజలు మరియు కరివేపాకులను సిద్ధం చేసుకున్న పేస్ట్‌లో ఉల్లిపాయ రసం వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ పేస్ట్‌ని మీ జుట్టుకు అప్లై చేసి 30 నుండి 40 నిమిషాల పాటు అలాగే ఉంచండి. తర్వాత షాంపూ మరియు కండీషనర్‌తో జుట్టును కడగాలి. ప్రతి వారం దీన్ని పునరావృతం చేయండి. జుట్టు రాలడం నివారించి జుట్టు పెరిగేలా చేస్తాయి. నేటి రాశిఫలం 31 జూలై 2024: ఈ రోజు సింహరాశి వారికి అదృష్టం వ్యాపారంలో ఆర్థిక లాభాలతో సంతోషంగా ఉంటారు కావాల్సిన పదార్థాలు 2 మీడియం సైజ్ క్యారెట్లు 1 అంగుళం అల్లం ముక్క 1-2 ఉసిరికాయలు పిడికెడు కరివేపాకు అవసరమైనంత నీరు ఎలా చేయాలి ఈ రసం సిద్ధం చేయడానికి ప్రతిదీ బాగా కడగాలి. క్యారెట్ మరియు అల్లం పై పొట్టు తొలగించాలి. తర్వాత క్యారెట్, అల్లం మరియు ఉసిరికాయలను చిన్న ముక్కలుగా కట్ చేసుకోండి. ఇప్పుడు తరిగిన క్యారెట్, అల్లం, ఉసిరి మరియు కరివేపాకులను బ్లెండర్లో వేయండి. దానికి కొద్ది మొత్తంలో నీరు కలపండి. తర్వాత మెత్తగా గ్రైండ్ చేయండి. ఈ మిశ్రమం చాలా చిక్కగా ఉంటే, కొద్దిగా నీరు కలపండి. ఇప్పుడు దీనిని స్ట్రైనర్ లేదా చీజ్‌క్లాత్ ఉపయోగించి ఫిల్టర్ చేయండి. ఒక గ్లాసులో రసం త్రాగాలి. ఈ పానీయం వారానికి 2-3 సార్లు త్రాగాలి.పానీయం యొక్క ప్రయోజనాలు క్యారెట్‌లో బీటా కెరోటిన్ మరియు విటమిన్ ఎ మరియు ఇ పుష్కలంగా ఉన్నాయి. జుట్టు ఆరోగ్యానికి ఇది చాలా అవసరం. విటమిన్ ఎ సెబమ్ ఉత్పత్తికి సహాయపడుతుంది, ఇది స్కాల్ప్ ను హైడ్రేట్ గా ఉంచుతుంది. అల్లంలో జింజెరాల్ ఉంటుంది, ఇది తలకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది జుట్టు పెరుగుదలకు సహాయపడుతుంది. స్కాల్ప్ ఆరోగ్యానికి సహాయపడే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. ఉసిరికాయలో విటమిన్ సి మరియు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది జుట్టు మొదళ్ల నుండి స్ట్రాంగ్ చేస్తుంది మరియు జుట్టు పెరుగుదలకు సహాయపడుతుంది. ఇది జుట్టు మరియు చుండ్రు తెల్ల జుట్టును కూడా నివారిస్తుంది. కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు, అమినో యాసిడ్లు, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. ఇది జుట్టును బలోపేతం చేయడానికి మరియు జుట్టు రాలడాన్ని నివారించడానికి సహాయపడుతుంది.

# వర్షాకాలంలో జుట్టు వాసనతో ఇబ్బంది పడుతున్నారా అయితే ఈ సులభమైన చిట్కాలను ఫాలో అవ్వండి


మండే వేడిలో, కొన్ని చుక్కల వర్షం మీ శరీరాన్ని మరియు మనస్సును ప్రశాంతపరుస్తుంది, అయితే ఈ వర్షం అనేక సమస్యలను కలిగిస్తుంది. వాస్తవానికి, వేసవి తర్వాత అకస్మాత్తుగా కొన్ని చుక్కల వర్షం పడితే, తేమ గణనీయంగా పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో, తలపై అధిక చెమట మొదలవుతుంది, దీని కారణంగా జుట్టు కూడా దుర్వాసన వస్తుంది. వర్షాకాలంలో, జుట్టు దుర్వాసన సమస్యతో చాలా మంది ప్రజలు ఇబ్బంది పడుతుంటారు. ఎందుకంటే స్కాల్ప్‌లో చెమట పట్టడం వల్ల వెంట్రుకల్లో బ్యాక్టీరియా లేదా ఫంగల్ ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు ఫిర్యాదు వస్తుంది. మురికి కారణంగా, వర్షాకాలంలో జుట్టు దుర్వాసన ప్రారంభమవుతుంది. అటువంటి పరిస్థితిలో, ఇప్పుడు మీరు చింతించాల్సిన అవసరం లేదు ఎందుకంటే వర్షాకాలంలో మీరు జుట్టు వాసనను ఎలా తొలగించవచ్చో ఇక్కడ మేము మీకు చెప్తాము? మీ జుట్టు కూడా దుర్వాసనతో ఉంటే, ఈ పరిస్థితిలో మీరు కొన్ని ఇంటి నివారణల సహాయం తీసుకోవచ్చు. అవును, జుట్టు నుండి వచ్చే వాసనను ఇంటి నివారణల సహాయంతో తగ్గించవచ్చు. ఈ కథనంలో, జుట్టు నుండి వచ్చే వాసనను తగ్గించగల అటువంటి ఆహార పరిష్కారాల ఇక్కడ ఉన్నాయి. చర్మం మిళమిళ మెరిపించడానికి, కళ్ళక్రింద, మెడ నలుపు పోగొట్టడానికి బియ్యం కడిగిన నీళ్ళు ఇలా వాడండి తులసి నీరుతో జుట్టు వాసనను తగ్గించండి జుట్టు వాసన సమస్యను తొలగించడానికి తులసి నీటిని ఉపయోగించండి. తులసి నీటిలో యాంటీ బాక్టీరియల్ గుణాలు ఉన్నాయి, ఇది ఇన్ఫెక్షన్లను తొలగిస్తుంది. దీని కోసం, మీ జుట్టును కడగడానికి తులసి నీటిని ఉపయోగించండి. తులసి నీటిని తయారు చేయడానికి, ఆకులను నీటిలో మరిగించి, మీ జుట్టును కడగడానికి ఇలా చేయడం వలన మీ జుట్టు నుండి వాసన పోతుంది. వంట సోడాతో జుట్టు వాసనను తగ్గించండి వర్షాకాలంలో జుట్టు నుండి దుర్వాసన రావడం సాధారణ సమస్య. అటువంటి పరిస్థితిలో మీరు బేకింగ్ సోడాను ఉపయోగించవచ్చు. దీని కోసం, బేకింగ్ సోడాను నీటిలో కలపండి మరియు ద్రావణాన్ని సిద్ధం చేయండి. దీని తర్వాత జుట్టును మళ్లీ దానితో కడగాలి. వర్షాకాలంలో బ్యాక్టీరియల్ మరియు ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, అందుకే జుట్టు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మీకు తెలియజేద్దాం. దీని కోసం, మీరు ఎప్పుడు బయటకు వెళ్లినా, మీ జుట్టును కట్టుకోండి.నిమ్మరసంతో జుట్టు వాసనను తగ్గించండి జుట్టు నుండి వచ్చే వాసనను తగ్గించడానికి మీరు నిమ్మరసాన్ని ఉపయోగించవచ్చు. నిమ్మరసంలో యాంటీ మైక్రోబియల్ ఉంటుంది, ఇది మీ తలపై ఉన్న దుర్వాసనను తొలగిస్తుంది. దీన్ని ఉపయోగించడానికి, ఒక కప్పు వేడి నీటిని తీసుకోండి, అందులో 2 టీస్పూన్ల నిమ్మరసం కలపండి. ఇప్పుడు ఈ నీటితో జుట్టును కడగాలి. దీంతో జుట్టు నుంచి వచ్చే వాసన తగ్గుతుంది. ముఖ్యమైన నూనె ఉపయోగించండి బాదం లేదా జోజోబా ఆయిల్ వంటి క్యారియర్ నూనెలతో టీ ట్రీ ఆయిల్ మిక్స్ చేసి మీ జుట్టుకు అప్లై చేయండి. ఇది మీ తల మరియు జుట్టు నుండి వచ్చే దుర్వాసనను తగ్గిస్తుంది. ఈ నూనెను మీ జుట్టుకు అప్లై చేసి సుమారు 30 నిమిషాల పాటు అలాగే ఉంచండి. దీని తర్వాత తేలికపాటి షాంపూ సహాయంతో మీ జుట్టును కడగాలి. టీ ట్రీ ఆయిల్‌లో యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉన్నాయి, ఇది తలపై వచ్చే సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఆపిల్ వెనిగర్ జుట్టు దుర్వాసన తగ్గించడానికి ఆపిల్ సైడర్ వెనిగర్ ఉపయోగించండి. దీన్ని ఉపయోగించడానికి, ఆపిల్ సైడర్ వెనిగర్‌ను 2 కప్పుల నీటితో కలపండి. ఇప్పుడు ఈ నీటి సహాయంతో మీ జుట్టును పూర్తిగా శుభ్రం చేసుకోండి. ఇది మీ తలపై ఉండే బ్యాక్టీరియాను నాశనం చేయడమే కాకుండా, మీ జుట్టును మెరిసేలా చేయడంలో కూడా ప్రభావవంతంగా పనిచేస్తుంది.



# వర్షాకాలంలో జుట్టు రాలడాన్ని నివారించడానికి ఈ ఐదు న్యాచురల్ హెయిర్ ఆయిల్స్

వేసవి తర్వాత వర్షాకాలం ప్రారంభం అయింది మరియు ఈ సీజన్ జుట్టు రాలడానికి కారణం అవుతుంది. గాలిలో తేమ మరియు హ్యుమిడిటి కారణంగా, మూలాలు బలహీనంగా మారతాయి మరియు మన జుట్టు రాలిపోయే అవకాశాలు పెరుగుతాయి. పోషకాహారం మరియు జీవనశైలి మన జుట్టును ఎంత ప్రభావితం చేస్తుందో, వాతావరణం కూడా సమాన పాత్ర పోషిస్తుంది. మీరు జుట్టు రాలడం సమస్యతో పోరాడుతున్నట్లయితే, రుతుపవనాలు మీకు మరింత దారుణంగా మారవచ్చు. కాబట్టి మీరు మీ జుట్టు గురించి చాలా ఆందోళన చెందుతుంటే, జుట్టు మొదళ్లకు అవసరమైన పోషణను ఇవ్వండి. జుట్టు మూలాలకు బలం మరియు పోషణను అందించడానికి నూనెను రాయడం అనేది అత్యంత ప్రసిద్ధి చెందిన ఔషధాలలో ఒకటి కాబట్టి, ఈ వర్షాకాలంలో బలమైన మెరిసే జుట్టును పొందడానికి ఈ నూనెలను మీ జుట్టుకు రాయడం ప్రయత్నించండి. చర్మం మిళమిళ మెరిపించడానికి, కళ్ళక్రింద, మెడ నలుపు పోగొట్టడానికి బియ్యం కడిగిన నీళ్ళు ఇలా వాడండి 1) ఎర్ర ఉల్లిపాయ నూనె ఎర్ర ఉల్లిపాయ నూనె దాని అద్భుతమైన ప్రయోజనాలకు ప్రసిద్ధి చెందింది. ఇది స్కాల్ప్ యొక్క జూఊ స్థాయిని నిర్వహించడంలో సహాయపడుతుంది మరియు తద్వారా జుట్టుకు బలాన్ని అందిస్తుంది. వర్షాకాలంలో ప్రజల అత్యంత సాధారణ సమస్య అయిన చుండ్రు మరియు చిట్లిన జుట్టుతో వ్యవహరించడంలో కూడా ఇది సహాయపడుతుంది. 2) భృంగరాజ్ ఆయిల్ జుట్టు రాలడం సమస్యకు ఆయుర్వేదంలో కొన్ని అద్భుతమైన నివారణలు ఉన్నాయి. బృంగరాజ్ నూనె యొక్క మంచితనం జుట్టు పల్చబడటం మరియు బట్టతల సమస్యను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. బృంగరాజ్ జుట్టు కుదుళ్లను పోషించడంలో సహాయపడుతుంది మరియు జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తుంది. ఇది తలలో రక్త ప్రసరణను కూడా పెంచుతుంది. 3) కొబ్బరి నూనె కొబ్బరి నూనె జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తుంది మరియు జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. కొబ్బరి నూనెలో కొవ్వు ఆమ్లాలు మరియు ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి తలకు లోతైన పోషణను అందించడంలో సహాయపడతాయి. ఇది తలకు చేరితే, జుట్టును బలపరుస్తుంది, అంతే కాదు, జుట్టు పొడిబారడాన్ని ఎదుర్కోవడంలో కొబ్బరి నూనె కూడా చాలా మంచిదని రుజువు చేస్తుంది. లావెండర్ ఆయిల్ లావెండర్ ఆయిల్ వర్షాకాలంలో ఉత్తమమైన నూనెలలో ఒకటి. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీవైరల్ మరియు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు స్కాల్ప్ డ్రై మరియు దురదను నివారిస్తుంది. గరిష్ట ప్రయోజనాల కోసం లావెండర్ నూనెను ఇతర ముఖ్యమైన నూనెలతో కూడా కలపవచ్చు. 5) మస్టర్డ్ ఆయిల్ సీజన్ ఏదైనప్పటికీ, ఆవాల నూనె మసాజ్ మీ మనస్సును రిలాక్స్ చేస్తుంది మరియు ఒత్తిడి నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. ఇది రక్త ప్రసరణను పెంచుతుంది, ఇది మూలాలకు పోషణను ప్రవహిస్తుంది. ఇది కాకుండా, యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఫంగల్ లక్షణాల కారణంగా ఆవాల నూనె రుతుపవనాలకు కూడా సరైనది.






# మరో థ్రిల్లర్ తో వస్తోన్న ప్రియమణి



ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు వెబ్‌సిరీస్‌లతో కెరీర్ ను ఫుల్ స్పీడులో నడుపుతున్నారు హీరోయిన్ ప్రియమణి. ది ఫ్యామిలీ మెన్, భామా కలాపం వెబ్ సిరీస్ లతో తనదైన నటనతో మెప్పించిన ప్రియమణి, రీసెంట్ గా ఆఫీసర్ ఆన్ డ్యూటీ అనే యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ లో నటించి బ్లాక్ బస్టర్ ను అందుకున్నారు. ఇప్పుడు తాజాగా ప్రిమయణి ప్రధాన పాత్రలో మరో వెబ్ సిరీస్ చేస్తోన్నారు. అదే గుడ్ వైఫ్. జులై 4 నుంచి జియో హాట్‌స్టార్ లో ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషలు సహా ఏడు భాషల్లో గుడ్ వైఫ్ రిలీజ్ అవుతోంది. ఈ సిరీస్ లో ప్రియమణితో పాటూ సంపత్ రాజ్, రేవతి, ఆరి అర్జునన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రీసెంట్ గా గుడ్ వైఫ్ సిరీస్ కు సంబంధించిన ట్రైలర్ ను రిలీజ్ చేశారు మేకర్స్. గుడ్ వైఫ్ లో ప్రియమణి తరుణిక అనే తల్లి పాత్రలో నటిస్తున్నారు. అప్పటివరకు ఇద్దరు పిల్లలకు తల్లిగా ఉన్న ప్రియమణి సడెన్ గా కోర్టు రూమ్ లోకి లాయర్ గా మారడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. గుడ్ వైఫ్ లో ప్రియమణికి భర్త పాత్రలో సంపత్ రాజ్ నటించగా, ఆయన స్కామ్ లో చిక్కుకుని అరెస్టవుతారు. భర్త అరెస్ట్ తో తరుణిక లైఫ్ ఒక్కసారిగా మారిపోతుంది. తన భర్తను కాపాడుకోవడానికి భార్య ఏం చేసింది? అసలామె లాయర్ గా ఎలా మారింది? ఈ ఒంటరి పోరాటంలో తరుణిక విజయం సాధించిందా? అసలు ఆమె భర్త అరెస్ట్ వెనుక ఇంకేదైనా కారణముందా లాంటి ప్రశ్నలు చాలా ఉన్నప్పటికీ ట్రైలర్ ఈ సిరీస్ పై ఆసక్తిని కలిగించింది. అమెరికన్ సిరీస్ ది గుడ్ వైఫ్ కు రీమేక్ గా ఈ సిరీస్ తెరకెక్కుతుండగా, నటి, డైరెక్టర్ రేవతి దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. గుడ్ వైఫ్ రీమేక్ గా తెరకెక్కుతున్నప్పటికీ ఇందులో కోర్టు సీన్స్, డ్రామా చాలా స్పెషల్ గా ఉండటంతో పాటూ ఇండియన్ నేటివిటీకి తగ్గట్టు చేసిన కొన్ని మార్పులు సిరీస్ కు ప్లస్ కానున్నాయి. ఇందులో ప్రియమణి లీడ్ రోల్ లో నటిస్తున్నప్పటికీ ఆమె అలా కనిపించకుండా, చాలా నేచురల్ గా ఒక సాధారణ కుటుంబంలోని భార్య, తన భర్త ఓ కేసులో ఇరుక్కుంటే ఏం చేస్తుందో అలానే కనిపిస్తూ చాలా సెటిల్డ్ గా నటించినట్టు అర్థమవుతుంది. జులై 4న ఈ సిరీస్ రిలీజ్ కానున్నప్పటికీ ఇంకా గుడ్ వైఫ్ కు కావాల్సినంత హైప్ రాలేదు. కానీ ట్రైలర్ రిలీజ్ తర్వాత మెల్లిగా సిరీస్ పై అందరికీ ఆసక్తి పెరుగుతుంది.



# మూవీ రివ్యూ : కన్నప్ప

'కన్నప్ప' మూవీ రివ్యూ నటీనటులు: మంచు విష్ణు- ప్రీతి ముకుందన్- మోహన్ బాబు- శరత్ కుమార్- ప్రభాస్- మోహన్ లాల్- మధుబాల- ముఖేష్ రుషి- రఘుబాబు- బ్రహ్మాజీ- శివబాలాజి- కౌశల్ తదితరులు సంగీతం: స్టీఫెన్ దేవాసీ ఛాయాగ్రహణం: షెల్డన్ చవు నిర్మాత: మోహన్ బాబు కథ-స్క్రీన్ ప్లే: మంచు విష్ణు దర్శకత్వం: ముకేశ్ కుమార్ సింగ్ కన్నప్ప.. మంచు విష్ణు కలల చిత్రం. పుష్కర కాలం కిందటే ఈ సినిమాకు సన్నాహాలు మొదలుపెట్టిన విష్ణు అండ్ టీం.. రెండేళ్ల కిందట ఈ చిత్రాన్ని సెట్స్ మీదికి తీసుకెళ్లింది. మేకింగ్.. పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యమై ఎట్టకేలకు ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి మంచు వారి డ్రీమ్ ప్రాజెక్టు ప్రేక్షకులను మెప్పించేలా ఉందా? వారి కష్టానికి ఫలితం దక్కుతుందా? తెలుసుకుందాం పదండి. కథ: కలియుగం 2వ శతాబ్దంలో ఉటుకూరు అనే గూడెంలో ఐదు గిరిజన తెగలు జీవిస్తుంటాయి. ఒక తెగకు నాయకుడైన నాథనాథుడి (శరత్ కుమార్) కొడుకు తిన్నడు (మంచు విష్ణు). తమ గూడెంలో అమ్మోరికి నరబలులు జరగడం చూసి తట్టుకోలేకపోయిన తిన్నడు చిన్నప్పటి నుంచే దేవుళ్ల మీద ద్వేషం పెంచుకుంటాడు. పెరిగి పెద్దయ్యే కొద్దీ ఆ ద్వేషం ఇంకా పెరుగుతుంది. కానీ అతను ప్రేమించిన నెమలి (ప్రీతి ముకుందన్) శివుడికి మహా భక్తురాలు. మరోవైపు ఈ ప్రాంతంలో ఉన్న వాయులింగాన్నిసొంతం చేసుకోవాలని కాలాముఖుడు అనే రాక్షసుడికి చెందిన సైన్యం ప్రయత్నిస్తుంటుంది. అతడి తమ్ముడు తిన్నడి చేతిలో చావడంతో మొత్తం గిరిజన తెగల్ని అంతమొందించాలని కాలాముఖుడు పంతం పడతాడు. అతడి నుంచి అందరికీ ముప్పు పొంచి ఉన్న తిన్నడు గూడెం నుంచి బహిష్కరణకు గురవుతాడు. మరి కాలాముఖుడి నుంచి గూడేన్ని తిన్నడు కాపాడగలిగాడా.. తన ప్రేమ సంగతి ఏమైంది.. దేవుడంటే అస్సలు గిట్టని తిన్నడు శివుడికి పరమ భక్తుడిగా ఎలా మారాడు.. ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి. కథనం-విశ్లేషణ: 'కన్నప్ప' సినిమాను మంచు విష్ణు అండ్ కో ఇంత పట్టుబట్టి.. భారీ బడ్జెట్ పెట్టి.. ఎంతో నమ్మకంగా తెరకెక్కించడానికి ప్రధాన కారణం.. ఆ కథలో ఉన్న బలం. కన్నప్ప అసలు పేరు.. తిన్నడు. మరి ఆ తిన్నడు కన్నప్ప ఎందుకు అయ్యాడు అన్నదే ఈ కథకు ప్రత్యేకతను చేకూర్చే విషయం. దేవుడు పేరెత్తితే మండిపడేవాడు.. పరమ భక్తుడిగా మారి.. తన కళ్లను దేవుడికి సమర్పించే దశకు వెళ్లడం అన్నది ఎంతో ఆసక్తి రేకెత్తించే పాయింట్. ముందు తరం ప్రేక్షకులను కదిలించిన ఈ కథను.. పకడ్బందీగా తెరకెక్కిస్తే ఇప్పటి ఆడియెన్సునీ కదిలించే అవకాశం ఉండేది. కానీ ఈ ప్రయత్నంలో విష్ణు అండ్ టీం పూర్తిగా సఫలం కాలేకపోయింది. అసహజమైన వాతావరణానికి తోడు కృత్రిమంగా అనిపించే పాత్రలు.. సన్నివేశాలతో చాలా సమయాన్ని వృథా చేసింది. గంటన్నర నిడివిలో 'వావ్' అనిపించే ఎపిసోడ్లు పెద్దగా లేవు. అసలు ప్రథమార్ధంలో కథే ముందుకు కదలదు. పూర్తిగా ద్వితీయార్ధం మీద భారం మోపేసి.. అంతకుముందు ఫిల్లింగ్ కోసం నామమాత్రపు సన్నివేశాలలో లాగించేసినట్లు అనిపిస్తుంది. గూడెం జనాల వ్యవహారాలు.. వాళ్ల ఆచారాలు.. అంతర్గత గొడవలు.. ఇవేవీ కూడా ఆసక్తి రేకెత్తించవు. హీరో హీరోయిన్ల రొమాంటిక్ ట్రాక్ కూడా సాగతీతగా అనిపిస్తుంది. విలన్ ట్రాక్ కూడా అంతంతమాత్రమే. ద్వితీయార్ధంలోనూ ఒక దశ వరకు 'కన్నప్ప' మామూలుగానే సాగుతుంది. మోహన్ లాల్ రాకతో కూడా కథలో ఊపు రాదు. చివరికి ప్రభాస్ రంగప్రవేశం చేశాక కానీ.. 'కన్నప్ప' వేగం పుంజుకోదు. ఎదురు చూపులకు తెరదించుతూ రుద్ర పాత్ర వచ్చాక అటు కథలో.. ఇటు ప్రేక్షకుల్లో చురుకు పుడుతుంది. తిన్నడి పాత్ర పరిణామం చెందిన దగ్గర్నుంచి 'కన్నప్ప' ప్రేక్షకులను ఎంగేజ్ చేస్తుంది. కథ ప్రకారం తిన్నడు కన్నప్పగా మారడానికి రుద్ర పాత్ర ఒక ఉత్ప్రేరకం అన్నమాట. ఈ సినిమా కూడా స్లో మోడ్ నుంచి కొంచెం వేగం పుంజుకోవడానికి ప్రభాస్ ఉత్ప్రేరకం లాగే ఉపయోగపడ్డాడు. ప్రభాస్ గొప్పగా నటించాడని చెప్పలేం కానీ.. తన స్క్రీన్ ప్రెజెన్స్ 'కన్నప్ప'కు ఎంతో ఉపయోగపడింది. నెమ్మదిగా నడుస్తున్న కథలో తన రాకతో వేగం అందుకుంటుంది. ప్రేక్షకుల్లోనూ ఉత్సాహం వస్తుంది. అక్కడి నుంచి చివరిదాకా 'కన్నప్ప' మంచి టెంపోతో సాగుతుంది. తిన్నడిలో పరివర్తన వచ్చే సన్నివేశాలు ఇంకా బలంగా ఉండాల్సింది అనిపిస్తుంది కానీ.. అతడిలో మార్పు వచ్చాక మాత్రం కథనం ఊపందుకుంటుంది. పతాక సన్నివేశాలు సినిమాకు మేజర్ హైలైట్ అని చెప్పొచ్చు. కానీ ముందు నుంచి సినిమాలో ఎమోషనల్ డెప్త్ ఉండుంటే.. ఈ సన్నివేశాలు ఇంకా గొప్పగా.. హృద్యంగా అనిపించేవి. మంచు విష్ణులో మునుపెన్నడూ చూడని నటనా ప్రతిభను ఆ సన్నివేశాల్లో చూస్తాం. గాయం చేసి మందేసినట్లుగా.. తొలి రెండు గంటల్లో నెమ్మదిగా సాగిన 'కన్నప్ప' చివరి గంటలో కొంత ఉపశమనాన్ని ఇస్తుంది. నటీనటులు: కన్నప్ప పాత్రను మంచు విష్ణు ఎలా చేస్తాడో అని అనుమానాలు వ్యక్తం చేసిన వాళ్లను కొన్ని సన్నివేశాల్లో అతను ఆశ్చర్యపరుస్తాడు. మొదట్లో చూస్తే కన్నప్ప పాత్రకు సరిపోయినట్లు అనిపించకపోయినా.. నెమ్మదిగా అలవాటు పడతాం. పతాక సన్నివేశాల్లో అతను చాలా సిన్సియర్ గా నటించినట్లు అనిపిస్తుంది. నాస్తికుడి నుంచి శివభక్తుడిగా పరిణామం చెందాక విష్ణు నటన ఆకట్టుకుంటుంది. ముందే అన్నట్లు కండలు తిరిగిన దేహం.. స్టైలింగ్ చేయించిన గడ్డం.. ఒంటి మీద టాటూలతో విష్ణు లుక్ మాత్రం మోడర్న్ గా అనిపిస్తూ.. కొంచెం ఇబ్బంది పెడుతుంది. నటన పరంగా మాత్రం విష్ణు కెరీర్లో కన్నప్ప పాత్ర గుర్తుంచుకోదగ్గది.




# సమంత స్టన్నింగ్ లుక్‌కి ఫ్యాషన్ ప్రపంచం ఫిదా!



టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి సమంత తాజాగా ఓ స్టన్నింగ్ లుక్‌తో సోషల్ మీడియాను షేక్ చేసింది. ఉఖి పవర్ లిస్ట్ 2025 ఈవెంట్‌కు హాజరైన సందర్భంలో ఆమె ధరించిన నెట్ డిజైన్ హై స్లిట్ గౌన్ లుక్‌కి నెటిజన్లు పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. బ్లాక్ కాంబినేషన్‌లో మెరిసిన ఈ డ్రెస్‌కు మ్యాచింగ్ మేకప్, స్ట్రెయిట్ హెయిర్ స్టైల్ తో తన యాటిట్యూడ్‌ను మరింతగా హైలైట్ చేసింది. కంగారు పడుతున్న ఫ్యాన్స్ ఈ ఫోటోషూట్‌లో సమంత అటిట్యూడ్, కాన్ఫిడెన్స్, స్టైల్ అన్నీ కలిపి ఫ్యాషన్ మ్యాగజైన్ కవర్‌కి సూట్ అయ్యేలా ఉన్నాయి. ఆమె ఈ లుక్‌లో కేవలం గ్లామర్‌తోనే కాదు, తనలో ఉన్న స్ట్రాంగ్ వైబ్ ని చూపించగలిగింది. నెట్ మెష్ డిజైన్‌తో ఉన్న ఈ డ్రస్సుకు స్లిట్ కట్ ఆకర్షణీయంగా ఉండి, సామంత యొక్క బోల్డ్ లుక్‌కు మరింత అందాన్ని తెచ్చిపెట్టింది. ఈ ఫొటోలు చూసిన అభిమానులు "ఈ లుక్‌తోనే మళ్లీ ట్రెండ్ లోకి వచ్చేసింది" అంటూ కామెంట్లు పెడుతున్నారు. తాజాగా ఆమె 'బంగారం' అనే సినిమాలో నటిస్తోంది. ఇది ఆమె కామ్‌బ్యాక్ మూవీగా ట్రీట్ అవుతోంది. అంతేకాదు, ఓ ఇంటర్నేషనల్ వెబ్ సిరీస్ అయిన 'రక్త బ్రహ్మాండ'లో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఇటీవల మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడిన సామ్ కొంతకాలం విరామం తీసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టింది. తన ఫిట్‌నెస్ ప్రయాణంలో భాగంగా వ్యాయామం, ధ్యానం, వైద్య చికిత్సలను పక్కాగా అనుసరిస్తూ, ఇప్పుడు మళ్లీ షూటింగ్‌కి సిద్ధమవుతోంది. "ఆరోగ్యం కోల్పోయినప్పుడే మన అసలు బలాన్ని గుర్తించగలం" అంటూ గతంలో చెప్పిన సామ్ ఇప్పుడు మళ్లీ తన పని పట్ల కమిట్‌మెంట్ చూపిస్తూ, అన్ని ఫ్రంట్‌లలో ముందుకు వెళ్తోంది. ఈ తాజా లుక్‌ద్వారా ఆమె ఇప్పటికీ ఫ్యాషన్ ఐకాన్‌గా నిలిచినట్టు మరోసారి ప్రూవ్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలు ఇప్పటికే లక్షల్లో లైక్స్ సంపాదించాయి. కామెంట్లలో అభిమానులు ఆమె స్టైల్, గ్లామర్, గ్రేస్‌పై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of Abhyudaya Publications, **cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**